


# వార్త వేకువ

తెలుగు దినపత్రిక

నిజం వైపు నిరంతరం...

PRGI No: TGTEL/26/A2290








ప్రచురణ : రంగారెడ్డి ఎడిటర్ : ఆవనగంటి అనిల్ కుమార్ సంపుటి : 01 సంచిక : 43 వెల : 4 పేజీలు : 08 శుక్రవారం 12 - 06 - 2026


## టీఎంసీ రెబల్ ఎంపీల భవిష్యత్ ప్రశ్నార్థకం



- ఫిరాయింపుల చట్టం ఏం చెబుతోంది?
- లోక్‌సభలో తృణమూల్ కాంగ్రెస్‌లో చీలిక
- 28 మంది ఎంపీలలో 20 మంది తిరుగుబాటు జెండా
- ఎన్డీయేకు మద్దతివ్వాలని యోచిస్తున్న రెబల్ వర్గం
- ఫిరాయింపుల నిరోధక చట్టంపై కొనసాగుతున్న చర్చ
- స్పీకర్ ఓం బిర్లా నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ

**వార్త వేకువ , ఢిల్లీ, జూన్ 11 :** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మొదలైన సంక్షోభం ఇప్పుడు దేశ రాజధాని ఢిల్లీకి పాకింది. అధికారాన్ని కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి లోక్‌సభలోనూ భారీ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీకి చెందిన 28 మంది లోక్‌సభ సభ్యులలో ఏకంగా 20 మంది ఎంపీలు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ప్రత్యేక వర్గంగా ఏర్పడి కేంద్రంలోని ఎన్డీయే కూటమికి మద్దతు ఇవ్వాలని వారు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ పరిణామం టీఎంసీలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది.సీనియర్ నాయకురాలు, నాలుగుసార్లు ఎంపీగా గెలిచిన కకోలీ ఘోష్ దస్తీదార్ ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహిస్తున్నారు. బుధవారం రాత్రి ఢిల్లీలో బీజేపీ సీనియర్ - మిగతా 2 లో

## నౌకలపై దాడులు ఆపండి

- గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలపై భారత్ తీవ్ర ఆగ్రహం
- గల్ఫ్ జలాల్లో వాణిజ్య నౌకలపై దాడులను తీవ్రంగా ఖండించిన భారత్
- అమెరికా జరిపిన దాడిలో ముగ్గురు భారత నావికుల దుర్మరణం
- ఘటనపై అమెరికా దౌత్యాధికారికి సమన్లు జారీ చేసి నిరసన
- పలు నౌకల్లో చిక్కుకున్న వందలాది భారతీయుల భద్రతపై ఆందోళన



**వార్త వేకువ , ఢిల్లీ, జూన్ 11 :** గల్ఫ్ ఆఫ్ ఒమన్, దాని పరిసర జలాల్లో వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడుల కారణంగా భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోవడంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా జరిపిన ఓ దాడిలో ముగ్గురు భారతీయులు మరణించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇటువంటి దాడులను వెంటనే నిలిపివేయాలని, దౌత్య మార్గాల ద్వారా శాంతిని నెలకొల్పాలని భారత విదేశాంగ శాఖ పిలుపునిచ్చింది.బుధవారం ఒమన్ తీరంలో 'ఎంటీ సెటెబెల్లో' అనే ఆయిల్ ట్యాంకర్‌పై అమెరికా బలగాలు దాడి చేశాయి. అమెరికా ఆంక్షలను ఉల్లంఘించి, ఈ నౌక ఇరాన్ నుంచి చమురు రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ దాడిలో డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా, చీఫ్ ఇంజనీర్ పట్నాల సురేష్ అనే ముగ్గురు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయారు. నౌకలోని మరో 21 మంది భారత సిబ్బందిని సురక్షితంగా రక్షించారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన భారత్, న్యూఢిల్లీలోని అమెరికా రాయబారికి సమన్లు జారీ చేసి తన నిరసనను వ్యక్తం చేసింది.గడిచిన కొద్ది రోజుల్లో భారతీయులు ఉన్న మూడు నౌకలపై దాడులు జరిగినట్లు షిప్పింగ్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. జూన్ 8న 'మారివెక్స్' నౌకలో మంటలు చెలరేగగా, అందులోని 24 మంది భారత సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. గురువారం షినాస్ పోర్టు వద్ద 'ఎంటీ జల్వీర్' నౌకపై దాడి జరగ్గా, ఒమన్ అధికారులు స్పందించి 20 మంది భారత సిబ్బందిని రక్షించారు.వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. నావికుల భద్రతకు, అంతర్జాతీయ జలాల్లో నౌకల స్వేచ్ఛాయుత ప్రయాణానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ నొక్కి చెప్పింది. ప్రస్తుతం హర్మూజ్ జలసంధిలో 13 భారతీయ నౌకలు, 562 మంది భారత నావికులు - మిగతా 2 లో

## రాత్రే ఇరాన్‌పై తీవ్ర దాడులు



- ట్రంప్ సంచలన ప్రకటన
- ఇరాన్ కీలక ఆయిల్ కేంద్రమైన ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామని వెల్లడి
- ఇప్పటికే ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న సైనిక ఘర్షణలు
- దాడుల హెచ్చరికల మధ్యే కొనసాగుతున్న దౌత్యపరమైన చర్చలు

**వార్త వేకువ , ఢిల్లీ, జూన్ 11 :** అమెరికా - ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పతాకస్థాయికి చేరాయి. ఇరాన్‌పై ఈ రాత్రే భారీస్థాయిలో దాడులు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. సమీప భవిష్యత్తులో ఇరాన్‌కు చెందిన కీలక చమురు క్షేత్రాలను, ముఖ్యంగా ఖర్గ్ ద్వీపాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.గురువారం తన - మిగతా 2 లో



## దమ్ముంటే 12 వైఫల్యాలపై జవాబివ్వండి

- బీజేపీపై వైఎస్ షర్మిల ఫైర్
- రాజ్యసభ సీటు అంశంపై బీజేపీ అనవసరంగా స్పందిస్తోందని విమర్శ
- కేంద్ర ప్రభుత్వ 12 వైఫల్యాలపై సమాధానం చెప్పే దమ్ము బీజేపీకి ఉందా అని ప్రశ్న
- ధరల పెరుగుదల, నిరుద్యోగం, మహిళల భద్రతపై కేంద్రాన్ని నిలదీత

**వార్త వేకువ , అమరావతి, జూన్ 11 :** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాజ్యసభ సీటు గురించి బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలను తిప్పికొడుతూ,కేంద్ర - మిగతా 2 లో

## ఏపీ రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం

### కూటమి ఖాతాలోకి మరో నలుగురు ఎంపీలు

- రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన కూటమి అభ్యర్థులు సానా సతీశ్, చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ, లింగమనేని రమేశ్
- నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈసీ ప్రకటన
- ప్రత్యర్థి పార్టీల నుంచి రాని నామినేషన్లు
- జనసేన నుంచి లింగమనేని రమేశ్ జయకేతనం



**వార్త వేకువ , అమరావతి, జూన్ 11 :** రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యులుగా సానా సతీశ్, చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ, లింగమనేని రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో నలుగురూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈసీ ధ్రువీకరించింది. నాలుగు ఖాళీలకు నాలుగు నామినేషన్లే దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించింది. అనంతరం ఎన్నికైన సభ్యులకు ధ్రువపత్రాలు జారీ చేసింది. రాష్ట్రం నుంచి నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీకాగా ముగ్గురు టీడీపీ తరపున, ఒకరు జనసేన తరపున ఎన్నికయ్యారు.ఏపీ నుంచి ఖాళీ అయిన 4 రాజ్యసభ స్థానాలకు కూటమి - మిగతా 2 లో

## లక్షలాది మంది జీవితాలతో ఆడుకున్నారు



- వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్
- డీఎస్సీ స్కామ్‌పై సీబీఐ దర్యాప్తు జరిపించాలి
- మెగా డీఎస్సీలో భారీ కుంభకోణం జరిగిందన్న వైఎస్ జగన్
- నియామక ప్రక్రియపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్

**వార్త వేకువ , అమరావతి, జూన్ 11 :** ఏపీ మెగా డీఎస్సీ పరీక్ష, నియామకాల ప్రక్రియలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, దీనిపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)తో విచారణ జరిపించాలని వైసీపీ - మిగతా 2 లో

## రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు



- తెలంగాణ రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- తొలి దశలో 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మిస్తున్నట్లు పొంగులేటి వెల్లడి
- దీని ద్వారా శిథిలావస్థలో ఉన్న భవనాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వెల్లడి
- భవనాల నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపును వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

2 లో



## కవిత కొత్త పార్టీకి పేరు చిక్కులు

- 'టీఆర్ఎస్'పై ముప్పేట దాడి
- కవిత కొత్త పార్టీ 'తెలంగాణ రక్షణ సేన'కు పేరు చిక్కులు
- 'టీఆర్ఎస్' పేరు తమదేనంటూ అభ్యంతరం వ్యక్తం చేసిన బీఆర్ఎస్
- మహారాష్ట్రకు చెందిన ఓ పార్టీ కూడా అదే పేరు కోసం దరఖాస్తు
- వివరణ ఇచ్చేందుకు ఎన్నికల సంఘాన్ని కలవనున్న కవిత ప్రతినిధులు

**వార్త వేకువ , హైదరాబాద్, జూన్ 11 :** కవిత ప్రతిపాదించిన కొత్త రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్)కు ఆరంభంలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. పార్టీ పేరు చుట్టూ తీవ్ర వివాదం నెలకొనడంతో, ఈ - మిగతా 2 లో

## ప్రధాని నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

- నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం తర్వాత ఇరువురి మధ్య ప్రత్యేక భేటీ
- రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ప్రధానితో చర్చించిన సీఎం
- తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చ
- వికసిత్ భారత్ 2047 లక్ష్యంతో జరిగిన నీతి ఆయోగ్ భేటీ



**వార్త వేకువ , హైదరాబాద్, జూన్ 11 :** ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో సమావేశం అయ్యారు. నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశం తర్వాత పీఎం, సీఎం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ప్రధానితో చర్చించారు. పెండింగ్‌లోని అంశాలను ఆమోదించాలని ప్రధానిని కోరారు.మోదీతో భేటీ అనంతరం కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. మెట్రోరైలు విస్తరణకు అనుమతులపై కేంద్రమంత్రితో చర్చించారు. మూసీ ప్రక్షాళన, పట్టణాభివృద్ధి సంబంధిత ప్రాజెక్టులపై ఖట్టర్‌తో రేవంత్ చర్చించారు. ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆ సమావేశంలో తెలంగాణ అభివృద్ధి నమూనాను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. దేశాభివృద్ధి అంటే.. ప్రజల అభివృద్ధేనని గుర్తుచేసిన సీఎం ప్రజలను ఆర్థిక శక్తులుగా, దేశనిర్మాతలుగా తీర్చిదిద్దడంలో విద్య, ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు.తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వేలో - మిగతా 2 లో

# సంపాదకీయం

## మరో ఎదురుదెబ్బ

విదేశీ వృత్తి నిపుణుల హెచ్1బీ వీసాలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన లక్షడాలర్ల ఫీజును అక్కడి ఫెడరల్ కోర్టు కొట్టివేయడం భారతీయులకు మంచి ఉపశమనం. అనేక కంపెనీలకు సైతం ఈ తీర్పుతో ఊరట లభించింది. ప్రవాస భారతీయ సంఘాలు, డెమోక్రాట్లే కాదు, ట్రంప్ సొంతపార్టీ నేతలు సైతం దీనిపై హర్షం వ్యక్తంచేస్తున్నారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న విదేశీయులను ఈ నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాద్వారా ఉద్యోగాల్లో నియమించుకొంటున్న అమెరికాలోని కంపెనీలకు నామమాత్రపు ఫీజుతో మెచ్చినవారిని ఎంపిక చేసుకొనే అవకాశాన్ని ట్రంప్ తన చర్యతో అడ్డుకొట్టారు. ఫీజును భరించలేని స్థాయికి పెంచడం ద్వారా విదేశీ ఉద్యోగులను అడ్డుకొని, వారిస్థానంలో ఆయా కంపెనీలు అమెరికన్లను నియమించుకొనేట్టు చేయాలన్నది ట్రంప్ ఆలోచన. గత ఏడాది సెప్టెంబర్‌లో ట్రంప్ విధించిన ఈ లక్షడాలర్ల ఫీజును భరించలేక కంపెనీలు హెచ్1బీ నియామకాలను తగ్గించుకున్నాయి కూడా. అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్, పలు డెమోక్రాటిక్ రాష్ట్రాలు, ప్రసిద్ధ కంపెనీలు సవాలు చేసిన నేపథ్యంలో ఇప్పుడు ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పు పూర్తి సాంకేతికమైనది. హెచ్1బీ విధానం మంచిచెడులు, న్యాయాన్యాయాల పరిధిలోకి పోకుండా, ఈ లక్షడాలర్ల ఫీజును పన్నుగా పరిగణిస్తూ, అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం లేకుండా దీనిని విధించే హక్కు దేశాధ్యక్షుడికి లేదని కోర్టు తేల్చింది.నీకు ఆ అధికారం లేదని కోర్టు అన్నంతమాత్రాన ట్రంప్ తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోరు కనుక, ఎప్పటిలాగానే, ట్రంప్ సర్కారు తనకు వ్యతిరేకంగా వచ్చిన ఈ తీర్పుమీద కూడా పై కోర్టులో సవాలు చేయడానికి సిద్ధపడుతోంది. తద్వారా, మరికొంతకాలం ఈ వివాదం ఉన్నతన్యాయస్థానాల్లో కొనసాగబోతోంది. అంతలోగా, ఈ తీర్పునుంచి దక్కిన ఉపశమనాన్ని నిపుణుల కొరతతో సతమతమవుతున్న కంపెనీలు సద్వినియోగం చేసుకొని, నియామకాలు పెంచుకొనే అవకాశం ఉన్నదని, భారతీయులే 70శాతానికి పైగా హెచ్1బీ వీసాలు పొందుతున్నందున వారికి ఈ పరిణామం లాభిస్తుందని కొందరి అంచనా. అయితే, ఓటమి సహించలేని ట్రంప్ కొన్ని విధానపరమైన చర్యలతో ఈ వీసాదారులకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు చేయకపోరు.ట్రంప్ టారిఫ్ వార్‌మీద సరిగ్గా నెలరోజుల క్రితం అమెరికా వాణిజ్య న్యాయస్థానం ఇచ్చిన తీర్పు కూడా ఇటువంటిదే. కాంగ్రెస్‌ను పక్కకునెట్టి, కేవలం కార్యనిర్వాహక ఆదేశాలతో అధ్యక్షుడు ఈ తరహా నిర్ణయాలు చేయకూడదన్నది ఈ తీర్పుల సారాంశం. మిగతా ప్రపంచంమీద ట్రంప్ ఇష్టారాజ్యంగా విధించిన ప్రతీకార సుంకాలు చెల్లవంటూ సుప్రీంకోర్టు ఫిబ్రవరిలో ఇచ్చిన ఆదేశాలను వెంటనే వమ్ముచేయడంకోసం, 1974 వాణిజ్యచట్టంలోని 122వ సెక్షన్ ప్రయోగించి ట్రంప్ పదిశాతం అదనపు సుంకం ఆదేశాలను ఇచ్చుకున్నారు. దీనిపై అమెరికా?లోని కొన్ని రాష్ట్రాలు, వ్యాపార వాణిజ్య సంస్థలు ట్రేడ్ కోర్టును ఆశ్రయించాయి. చెల్లింపుల సంక్షోభంతో వ్యవహరించడానికి అధ్యక్షుడికి ఈ సెక్షన్ ద్వారా ఐదునెలల పాటు టారిఫ్ విధించే హక్కు ఉందన్న ట్రంప్ వాదనను కోర్టు అంగీకరించలేదు. ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్ యాక్ట్ (ఐఈఈపిఎ) కింద గత ఏడాది విధించిన ప్రతీకార సుంకాలకు సుప్రీంకోర్టు అడ్డుపడటంతో, ఆయన ఇలా మరో చట్టాన్ని వాడి ఎదురుదెబ్బ తిన్నారు. తనకు వ్యతిరేకంగా తీర్పులు వచ్చిన ప్రతీ సందర్భంలోనూ న్యాయమూర్తులను నిందించడం, వారికి దేశభక్తి లేదనడం, పక్షపాతాన్ని అంటగట్టడం ట్రంప్‌కు తెలిసిన విద్య. అమెరికా కోర్టులు తనకు అడ్డుపడుతూంటే మిగతాదేశాలు సంతోషిస్తాయని, అవి ఏ విధమైన తీర్పులు ఇచ్చినా, ఉన్న చట్టాలన్నీ తవ్వితీసి తాను చేయదల్చుకున్నదే చేస్తానని ట్రంప్ చెబుతూంటారు. ఇటీవల భారత్ సహా యాభైమూడు దేశాలకు పన్నెండున్నరశాతం సుంకాలను ప్రతిపాదించడం అందులో భాగమే. కొత్తదారుల్లో, కొత్త పేర్లతో టారిఫ్ వార్‌ను ఒక వాణిజ్య విధానంగా ఆయన అమలుచేయదల్చుకున్నారు. మధ్యంతర ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో ట్రంప్‌కు అమెరికా ప్రయోజనాల పరిరక్షకుడిగా కనిపించడం మరీ అవసరం. అమెరికాని మళ్ళీ ఉన్నతంగా నిలబెట్టడం కోసం మిగతా ప్రపంచంతో పోరాడుతున్న తనకు, న్యాయస్థానాలు ద్రోహం చేస్తున్నాయని ఆయన ప్రచారం చేసుకోవచ్చు. ఇరాన్‌తో యుద్ధం తనను విజేతగా, హీరోగా నిలబెడుతుందన్న ఆశ నెరవేరకపోగా, రాజకీయంగా అప్రదిష్ఠ తీసుకువచ్చింది. ట్రేడ్‌వార్‌లోనూ, ఇరాన్‌వార్‌లోనూ ఎదురుదెబ్బలు తింటున్న ట్రంప్ ఎన్నికలు ముగిసేలోగా ఎన్ని ఎత్తులు వేస్తారో, ఎన్ని విన్యాసాలు చేస్తారో చూడాలి.

## రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రంలోని అన్ని ఆర్డీవో, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలను నిర్మించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈరోజు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు గౌరవప్రదమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.తొలి దశలో భాగంగా 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఒకే నమూనాలో కొత్త భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అద్దె ఇళ్లలో, శిథిలావస్థలో ఉన్న కార్యాలయాల సమస్యకు దీని ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు తుది డిజైన్లను ఖరారు చేస్తామని తెలిపారు. భవన నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.మరోవైపు, ఓఆర్ఆర్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి ఆధునిక సమీకృత భవనాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్, పటాన్‌చెరు, కోహెడలలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు.గత ప్రభుత్వం ప్రణాళిక లేకుండా మండలాల పునర్విభజన చేసిందని విమర్శించిన మంత్రి, తాము కొత్త మండలాలకు అవసరమైన పోస్టులను భర్తీ చేసి పరిపాలనను బలోపేతం చేశామని వివరించారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## కవిత కొత్త పార్టీకి పేరు చిక్కులు

**మొదటిపేజీ తరువాయి -** అంశం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 'టీఆర్ఎస్' అనే పేరును ఇతరులకు కేటాయించవద్దంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) పలు వైపుల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తాయి.ఈ వివాదంలో ప్రధానంగా భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'టీఆర్ఎస్' అనే పేరు 14 ఏళ్ల తెలంగాణ ఉద్యమ చరిత్రతో, ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ తమ పార్టీని ప్రజలు 'టీఆర్ఎస్'గానే గుర్తిస్తున్నారని, కాబట్టి ఆ పేరును వేరొకరికి కేటాయించవద్దని కోరుతూ ఈసీకి అధికారికంగా ఫిర్యాదు చేసింది.మరోవైపు, కవిత పార్టీ ప్రకటనకు ఒక రోజు ముందే మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన 'తెలంగాణ రాష్ట్రసామాజిక సేన' అనే సంస్థ కూడా 'టీఆర్ఎస్' అనే పేరు కోసం ఈసీకి దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. సోలాపూర్‌కు చెందిన దయానంద్ మహాదేవ్ మామ్‌డ్యాల్ ఈ మేరకు దరఖాస్తు చేసినట్లు తెలియవచ్చింది.ఇవి మాత్రమే కాకుండా, కవిత పత్రికల్లో ఇచ్చిన ప్రకటన ఆధారంగా సుమారు 600 నుంచి 700 వరకు ప్రజా అభ్యంతరాలు ఈసీకి అందినట్లు సమాచారం. అదే సమయంలో, రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఇప్పటికే 'తెలంగాణ రాజ్య సమితి' పేరుతో నమోదైన మరో పార్టీ కూడా 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త నామాన్ని వాడటంపై అభ్యంతరం తెలుపుతూ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది.ఈ పరిణామాల నేపథ్యంలో, తమ వాదనలు వినిపించేందుకు కవిత ప్రతినిధుల బృందం త్వరలో ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు సిద్ధమవుతోంది. ఒకే పేరుపై ఇన్ని వైపుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్న తరుణంలో కవిత తన కొత్త పార్టీకి 'టీఆర్ఎస్' పేరును దక్కించుకుంటారా లేదా అన్నది ఇప్పుడు తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

## నౌకలపై దాడులు ఆపండి

**మొదటిపేజీ తరువాయి -** ఉన్నారని అధికారులు తెలిపారు. ప్రభావిత సిబ్బందికి అవసరమైన సహాయం అందించేందుకు ఒమన్ అధికారులతో భారత ప్రభుత్వం నిరంతరం సమన్వయం చేసుకుంటోంది.

## టీఎంసీ రెబల్ ఎంపీల భవిష్యత్ ప్రశ్నార్థకం

**మొదటిపేజీ తరువాయి -** నేత భూపేందర్ యాదవ్ నివాసంలో ఈ రెబల్ ఎంపీలు సమావేశమైనట్లు తెలుస్తోంది. తమను ప్రత్యేక పార్లమెంటరీ గ్రూపుగా గుర్తించాలని కోరుతూ త్వరలోనే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలవాలని వారు నిర్ణయించుకున్నారు.అయితే, ఈ ఎంపీల భవిష్యత్తు రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ (ఫిరాయింపుల నిరోధక చట్టం) పరిధిలో ఉండటంతో రాజకీయంగా ఉత్కంఠ నెలకొంది. చట్టం ప్రకారం అనర్హత వేటు నుంచి తప్పించుకోవాలంటే, పార్టీలోని మొత్తం సభ్యులలో కనీసం మూడింట రెండొంతుల మంది విడిపోవాల్సి ఉంటుంది. టీఎంసీకి ఉన్న 28 మంది ఎంపీలలో ఈ సంఖ్య 19 కాగా, తమకు 20 మంది బలం ఉందని రెబల్ వర్గం ధీమా వ్యక్తం చేస్తోంది. అయితే, కేవలం పార్టీ నుంచి విడిపోవడం సరిపోదని, మరో పార్టీలో విలీనం అయితేనే చట్టపరమైన రక్షణ లభిస్తుందని రాజ్యాంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలోనూ టీఎంసీ ఎమ్మెల్యేలు ఇటీవలే తిరుగుబాటు చేశారు. పార్టీలో అభిషేక్ బెనర్జీ నిరంకుశ వైఖరి, వారసత్వ రాజకీయాల వల్లే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని తిరుగుబాటు నేతలు ఆరోపిస్తున్నారు. మరోవైపు, టీఎంసీ విధేయులు ఈ ఆరోపణలను ఖండిస్తున్నారు. నిజంగా బలం ఉంటే స్పీకర్‌కు లేఖ ఇవ్వాలని సవాల్ విసురుతున్నారు. ప్రస్తుతం అందరి దృష్టి స్పీకర్ ఓం బిర్లా తీసుకోబోయే నిర్ణయంపైనే ఉంది.

# ఏపీ రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం



**మొదటిపేజీ తరువాయి -** ఒప్పందం మేరకు 4 రాజ్యసభ స్థానాల్లో 1 జనసేన, 3 టీడీపీకి ఖరారైన సంగతి తెలిసిందే. రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ గడువు సోమవారంతో ముగిసింది. మంగళవారం నామినేషన్ల పరిశీలన, బుధవారం ఉపసంహరణకు చివరి తేదిగా గడువు పెట్టారు. చివరికి నాలుగు ఖాళీలకు నాలుగు నామినేషన్లే దాఖలవడంతో గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈసీ ప్రకటించింది.విద్యావేత్త, భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీకి అన్ని విధాలా అండగా నిలిచారు. 2024లో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పార్టీ సంస్థాగత నిర్మాణం, శిక్షణ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. 2024 ఎన్నికల్లో గుంటూరు లోక్‌సభ టికెట్ ఆశించినా వివిధ కారణాలతో ఆయనకు దక్కలేదు. అయినప్పటికీ పార్టీని వీడకుండా సేవలందిస్తున్నారు. త్రజాగా కూటమి టీడీపీ రాజ్యసభ సీటును భాష్యం రామకృష్ణకు కేటాయించింది.కాకినాడకు చెందిన సానా సతీశ్ 2024 ఎన్నికల్లో లోక్‌సభ టికెట్ ఆశించినా రాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక 2024 డిసెంబరులో మోపిదేవి వెంకటరమణారావు రాజీనామాతో జరిగిన రాజ్యసభ ఉప ఎన్నికలో సతీశ్ ఎన్నికయ్యారు. ఏడాదిన్నర మాత్రమే ఎంపీగా ఉన్నందున, సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని మరోసారి అవకాశం ఇచ్చారు.బీసీ సామాజికవర్గానికి అవకాశం ఇవ్వడంతో పాటు యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అధిష్ఠానం చింతకాయల విజయ్‌ను ఎంపిక చేసింది. విజయ్ తండ్రి అయ్యన్నపాత్రుడు శాసనసభాపతిగా ఉన్నా, టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో విజయ్ పార్టీకి చేసిన సేవలు ఆయన ఎంపికకు కలిసొచ్చాయి. 2024 ఎన్నికల్లో అనకాపల్లి లోక్‌సభ టికెట్ ఆశించినా అప్పటి రాజకీయ సమీకరణాల వల్ల దక్కలేదు. తన కుమారుడికి రాజ్యసభకు అవకాశం ఇవ్వాలని అయ్యన్నపాత్రుడు ఈసారి గట్టిగా కోరడంతో ఆ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని విజయ్‌కు ఛాన్స్ ఇచ్చారు. జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేశ్ పేరు పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసింది. లింగమనేనికి పార్టీతో 2015 నుంచి అనుబంధం ఉందని పవన్ రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్ తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలనే పవన్ ఆలోచనలకు లింగమనేని ఆకర్షితులయ్యారన్నారు. 2019 ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వచ్చినా లింగమనేని, పవన్ వెంటే ఉన్నారని గుర్తు చేశారు. ఓర్పుతో ఉన్నవారికి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించామన్నారు. నేతల కులమతాలు పట్టించుకోకుండా అవకాశం కల్పించామని తెలిపారు. ఇదే సూత్రాన్ని రాజ్యసభ అభ్యర్థి ఎంపికలోనూ పవన్ అనుసరించారని హరిప్రసాద్ స్పష్టం చేశారు.

# దమ్ముంటే 12 వైఫల్యాలపై జవాబివ్వండి

**మొదటిపేజీ తరువాయి -** ప్రభుత్వ 12 ఏళ్ల వైఫల్యాలపై సమాధానం చెప్పే దమ్ముందా అని సవాల్ విసిరారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.రాజ్యసభ సీటు అనేది మాట ఇచ్చిన వారికి, తీసుకున్న వారికి సంబంధించిన వ్యక్తిగత విషయమని, మధ్యలో బీజేపీ నేతల అసహనం, అతి స్పందన ఎందుకని షర్మిల ప్రశ్నించారు. తాము ప్రజా సమస్యలపై, ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీస్తుంటే, సమాధానం చెప్పలేక అర్థం పర్థం లేని అంశాలను తెరపైకి తెచ్చి బీజేపీ తన సంస్కారాన్ని బయటపెట్టుకుంటోందని విమర్శించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే, కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిన 12 వైఫల్యాలపై చర్చకు రావాలని, పుండు మీద కారం చల్లే చేష్టలు మానుకోవాలని హితవు పలికారు.కేంద్ర ప్రభుత్వ పాలనపై షర్మిల ప్రశ్నల వర్షం కురిపించారు. "రైళ్లు, రహదారులు అని గొప్పలు చెప్పడం కాదు, నిత్యావసరాల ధరలు 300 శాతం ఎందుకు పెరిగాయో చెప్పాలి. అతిపెద్ద స్టార్టప్ దేశమని చెప్పుకోవడం కాదు, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేకపోయారో సమాధానం చెప్పాలి. డీబీటీల గురించి కాదు, దేశవ్యాప్తంగా 28 సార్లు జరిగిన పేపర్ లీకుల గురించి మాట్లాడాలి. మహిళా సాధికారిత అని సమర్థించుకోవడం కాదు, ఏటా జరుగుతున్న 5 లక్షల అఘాయిత్యాలపై జవాబివ్వాలి" అని ఆమె నిలదీశారు.అంతేకాకుండా, దేశ ఆర్థిక పరిస్థితిపైనా షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. "తెచ్చిన లక్షల కోట్ల అప్పులు ఎక్కడ ఖర్చు చేశారో శ్వేతపత్రం ఇవ్వాలి. దేశీయ ఆర్థిక వృద్ధి మెరుగ్గా ఉంటే, డాలర్‌తో రూపాయి విలువ రెండింతలు ఎందుకు పతనమైంది? పీఎం కిసాన్ నిధులతో రైతులను ఆదుకుంటే, ఏటా 12 వేల మంది రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు?" అని ఆమె ప్రశ్నించారు.విభజన రాజకీయాల గురించి బీజేపీ మాట్లాడటం 'దెయ్యాలు వేదాలు వల్లించినట్టు' ఉందని షర్మిల ఎద్దేవా చేశారు. మతాల మధ్య చిచ్చు పెట్టి, ఓటు బ్యాంకు రాజకీయాలు చేసేది ఎవరో దేశ ప్రజలందరికీ తెలుసన్నారు. ఎన్నికల కమిషన్ వంటి రాజ్యాంగ సంస్థలను కీలుబొమ్మలుగా మార్చుకుని, ఓట్లు, సీట్ల చోరీకి పాల్పడుతున్నంత కాలం బీజేపీకి ప్రజాభిమానం లభించదని, వారికి దక్కేవి దొంగ సర్టిఫికెట్లు మాత్రమేనని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ అంకితభావంతో ఉందని, ప్రజా ఉద్యమ గొంతుక తమదేనని షర్మిల స్పష్టం చేశారు.

# లక్షలాది మంది జీవితాలతో ఆడుకున్నారు

**మొదటిపేజీ తరువాయి -** అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ డిమాండ్ చేశారు. నేడు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, డీఎస్సీకి సంబంధించి వెలుగులోకి వస్తున్న వాస్తవాలు అత్యంత దిగ్భ్రాంతికరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కుంభకోణాలతో లక్షలాది మంది అభ్యర్థుల నమ్మకాన్ని వమ్ము చేసిందని, ప్రతిభావంతులైన నిరుద్యోగుల జీవితాలను తీవ్రంగా దెబ్బతీసిందని జగన్ ఆరోపించారు. ఇంతటి దారుణమైన నియామక ప్రక్రియను ఎక్కడా చూడలేదని అన్నారు. "అబద్ధాలు, మోసం, దగా, వెన్నుపోటు, కుంభకోణాలకు చొక్కా, ప్యాంటు వేస్తే అది చంద్రబాబు అవుతారు" అని ఆయన విమర్శించారు. లక్షలాది మంది యువత ఆశలు, భవిష్యత్తు ముడిపడి ఉన్న డీఎస్సీ వంటి ప్రక్రియలో కూడా అవినీతి, అక్రమాలకు పాల్పడటం అత్యంత దారుణమని అన్నారు.ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను జనరేషన్ జెడ్ గమనిస్తోందని చంద్రబాబు గుర్తుంచుకోవాలని జగన్ హెచ్చరించారు. "చంద్రబాబూ గుర్తుంచుకో, ఇది జెన్ జెడ్. జెన్ ఆల్ఫా కూడా వస్తోంది. తప్పులు ఒప్పుకోకుండా ఇబ్బంది పెడితే బొద్దింకలు తిరగబడతాయి" అని వ్యాఖ్యానించారు. నీట్ పేపర్ లీక్ తర్వాత ఆన్‌లైన్‌లో మొదలైన 'జనతా కాక్రోచ్ పార్టీ' ఉద్యమం గురించి ప్రస్తావించగా, "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మేం కూడా బొద్దింకలమే. యువతకు అన్యాయం జరిగితే వారు ఇలాంటి మార్గాలనే ఎంచుకుంటారు" అని జగన్ పేర్కొన్నారు.డీఎస్సీ అక్రమాలపై జగన్ వివరంగా మాట్లాడుతూ.. 1995 నుంచి చంద్రబాబు పాలన లీకులు, అవినీతితోనే నిండిపోయిందన్నారు. ఈసారి డీఎస్సీ కన్వీనర్‌ను పక్కనపెట్టి, ప్రశ్నపత్రం రూపకల్పన, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు అప్పగించారని, ఒకే అధికారి చేతిలో కీలక అధికారాలు కేంద్రీకరించి పారదర్శకతను దెబ్బతీశారని ఆరోపించారు. ప్రశ్నపత్రం ఎంతమంది చేతుల్లోకి వెళ్లింది, ఎంత డబ్బు చేతులు మారింది అనే విషయాలు థర్డ్ పార్టీ ఏజెన్సీ విచారణలోనే తేలుతాయన్నారు.స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయంటూ జగన్ ధ్వజమెత్తారు. "స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు అర్హత పరీక్ష రాయాల్సిన అవసరం లేదని, కేవలం పార్టిసిపేషన్ సర్టిఫికేట్ ఉంటే చాలని జీవోలు ఇచ్చి తమకు కావాల్సిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇచ్చిన కాలేజీ, యూనివర్సిటీ, జిల్లా స్థాయి పోటీల పార్టిసిపేషన్ సర్టిఫికేట్లతో ఉద్యోగాలు ఇచ్చారు. మరోవైపు, జాతీయ క్రీడల్లో బంగారు పతకాలు సాధించి ఇంటర్వ్యూలకు పిలిపించిన నిజమైన అభ్యర్థులకు ఉద్యోగాలు రాలేదు. మొత్తం 270 మంది అర్హత పరీక్ష రాయకుండానే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందారు" అని జగన్ వివరించారు.తమ హయాంలో నోటిఫికేషన్ నుంచి నియామక పత్రాలు ఇచ్చే వరకు కేవలం నాలుగు నెలల్లో 1.30 లక్షల ఉద్యోగాలను ఎలాంటి లోపాలు లేకుండా భర్తీ చేశామని జగన్ గుర్తుచేశారు. డీఎస్సీ వ్యవహారంలో చంద్రబాబు, విద్యాశాఖ మంత్రిగా ఉన్న ఆయన కుమారుడు లోకేశ్ ముద్దాయిలని, వారే తీర్పు చెబితే న్యాయం జరగదని, అందుకే సీబీఐ విచారణ డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. జూన్ 12న తలపెట్టిన 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసన కార్యక్రమంలో ఈ డీఎస్సీ అక్రమాల అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# ప్రధాని నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని రేవంత్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడున్నర కోట్ల మంది, 242 కులాలకు చెందిన ప్రజల వివరాలను సేకరించినట్లు చెప్పారు. ఆ సర్వేలో నగదు, భూమి కంటే విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తోన్న ముఖ్యమైన అంశంగా తేలిందని చెప్పారు. ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య అందించడం ద్వారానే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని స్పష్టం చేశారు.ప్రస్తుతం నాణ్యమైన విద్య అందించడం సవాలుగా మారిందని సీఎం వ్యాఖ్యానించారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ, విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ తరగతులు, ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ తోపాటు పాఠశాల బస్సులు, క్రీడా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.నర్సరీ నుంచి ఇంటర్ వరకు ఒకే క్యాంపస్‌లో చదివే అవకాశం కల్పిస్తున్నట్లు రేవంత్‌రెడ్డి చెప్పారు. యంగ్ ఇండియా స్కూల్స్ కులాల మధ్య గోడలు కూల్చేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి అయినా, అధికారులైనా యంగ్ ఇండియా స్కూల్స్ చూడాలంటే సంతోషంగా చూపిస్తామన్నారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో యువతకు కొత్త నైపుణ్యాలు అవసరమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తయారీ, సేవారంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్వే, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. యువతకు ప్రపంచస్థాయి శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా మార్చేందుకు టాటా గ్రూప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని సీఎం తెలిపారు. ఈ ప్రాజెక్టులో టాటా సంస్థ రూ.2,100 కోట్ల పెట్టుబడి పెడుతుందన్నారు.తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చెప్పారు. ఉన్నత విద్య, పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధికి తెలంగాణ కేంద్రంగా మారుతోందన్నారు. ఇప్పటికే ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, నల్సార్, ఐఎస్‌బీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉన్నాయని, హైదరాబాద్‌కు ఐఐఎం కూడా రావాల్సిన అవసరం ఉందని చెప్పారు.అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తెలంగాణకు తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. యూనివర్సిటీ ఆఫ్ లండన్ హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయడం తొలి విజయమని చెప్పారు. దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజిన్లుగా ఉన్న ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. ఈ నగరాల అభివృద్ధి కోసం రూ.6 లక్షల కోట్ల ప్రత్యేక నిధిని మౌలిక వసతుల కోసం కేటాయించాలని కోరారు.తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతూ సీఎం పలు ప్రతిపాదనలు చేశారు. రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, మూసీ పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు.

# రాత్రే ఇరాన్‌పై తీవ్ర దాడులు



**మొదటిపేజీ తరువాయి -** ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ రాత్రే అమెరికా బలగాలు ఇరాన్‌పై అత్యంత తీవ్రమైన దాడులు చేయనున్నాయి. త్వరలోనే ఖర్గ్ ద్వీపంతో పాటు ఇతర చమురు మౌలిక సదుపాయాల కేంద్రాలను స్వాధీనం చేసుకుంటాం. వారి చమురు, గ్యాస్ మార్కెట్లపై పూర్తి నియంత్రణ సాధిస్తాం" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.ఇప్పటికే ఇరు దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఇటీవల ఇరాన్‌కు చెందిన గగనతల రక్షణ, నిఘా వ్యవస్థలపై అమెరికా దాడులు నిర్వహించింది. మరోవైపు, తమ అపాచీ హెలికాప్టర్‌ను ఇరాన్ కూల్చివేసిందని అమెరికా ఆరోపిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ చేసిన తాజా హెచ్చరికలు అంతర్జాతీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.పర్షియన్ గల్ఫ్‌లో ఉన్న ఖర్గ్ ద్వీపం, ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఆ దేశం నుంచి జరిగే ముడి చమురు ఎగుమతుల్లో సుమారు 90 శాతం ఇక్కడి నుంచే సాగుతాయి. ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ ప్రకటించడం ప్రపంచ దేశాల్లో ఆందోళన కలిగిస్తోంది. సైనిక చర్యల హెచ్చరికల కొనసాగుతున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన చర్చలు కూడా జరుగుతున్నాయని, అయితే అవి మందకొడిగా సాగుతున్నాయని తెలుస్తోంది.

# నీతి ఆయోగ్ భేటీలో 'స్వర్ణాంధ్ర ఏ2047' విజన్

## సీఎం చంద్రబాబు కీలక ప్రజంటేషన్



ఢిల్లీ వేదికగా జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సంబంధించిన కీలక ప్రణాళికను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ 'వికసిత భారత్ ఏ2047' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర ఏ2047' విజన్‌ను ఆయన సభ్యుల ముందుంచారు. ఈ విజన్ ద్వారా రాష్ట్రాన్ని సంపన్న, సమ్మిళిత, ప్రపంచ పోటీతత్వ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమని స్పష్టం చేశారు.మానవ వనరుల ఆధారిత అభివృద్ధి నమూనాను అమలు చేస్తామని చంద్రబాబు వివరించారు. దీని ద్వారా సంపూర్ణ పేదరిక నిర్మూలన, భారీ ఎత్తున ఉపాధి అవకాశాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, జల, ఇంధన భద్రత కల్పించడం తమ ప్రభుత్వ ప్రాధాన్యతలని తెలిపారు. వ్యవసాయ-టెక్, లాజిస్టిక్స్, డీప్-టెక్ వంటి రంగాలను అనుసంధానిస్తూ అభివృద్ధిని వేగవంతం చేస్తామని అన్నారు. పాలనలో పారదర్శకత, సామర్థ్యం పెంచేందుకు రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత విశ్లేషణలు, రియల్ టైమ్ మానిటరింగ్ వ్యవస్థలు, 'అవేర్' వంటి ముందస్తు అంచనా సాధనాలను వినియోగిస్తున్నామని, ఇవి మెరుగైన పౌర సేవలకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.తమ ప్రభుత్వం తీసుకొచ్చిన పాలనా సంస్కరణలు, పారదర్శక విధానాలు, వ్యాపార అనుకూల వాతావరణం కారణంగా గత రెండేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి సభకు తెలియజేశారు. దీనివల్ల రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి కల్పనతో పాటు ఆర్థిక వృద్ధికి మార్గం సుగమమైందని అన్నారు.ఈ సందర్భంగా రాష్ట్రాల మధ్య పెట్టుబడుల ఆకర్షణ కోసం అనారోగ్యకరమైన పోటీ తగదని హితవు పలికారు. కేవలం ప్రోత్సాహకాలపై ఆధారపడకుండా మౌలిక సదుపాయాల బలోపేతం, విధాన స్థిరత్వం, అనుమతుల వేగవంతం వంటి సుస్థిర అభివృద్ధి మార్గాలపై దృష్టి సారించాలని రాష్ట్రాలకు సూచించారు.సమ్మిళిత అభివృద్ధి తమ ప్రభుత్వ అజెండా అని పునరుద్ఘాటించిన చంద్రబాబు, ప్రతి కుటుంబానికి ఇల్లు, పారిశుద్ధ్యం, కుళాయి నీరు, స్వచ్ఛమైన వంట ఇంధనం, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ, ప్రత్యక్ష నగదు బదిలీ వంటి ఏడు ప్రాథమిక అవసరాలను అందిస్తామని తెలిపారు.సమాజంలోని ఉన్నత వర్గాల్లోని 10 శాతం మంది, అట్టడుగున ఉన్న 20 శాతం మందికి అండగా నిలిచేందుకు ఉద్దేశించిన వినూత్న 'పీ4-ఎంబీకే 10-20' కార్యక్రమాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఆరోగ్య రంగంలో 'ప్రాజెక్ట్ సంజీవని' ద్వారా నివారణ వైద్యానికి పెద్దపీట వేస్తున్నామని, ఏఐ ఆధారిత విద్యతో భవిష్యత్ అవసరాలకు యువతను తీర్చిదిద్దుతున్నామని వివరించారు.రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.5 కంటే తక్కువగా ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, జనాభా సుస్థిరతపై జాతీయ స్థాయిలో దృష్టి సారించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. భవిష్యత్తులో శ్రామిక శక్తి కొరత, వృద్ధాప్య సంబంధిత సవాళ్లను ఎదుర్కొనేందుకు రాష్ట్ర జనాభా నిర్వహణ విధానాన్ని రూపొందించినట్లు తెలిపారు.సహకార సమాఖ్య స్ఫూర్తికి ఆంధ్రప్రదేశ్ కట్టుబడి ఉందని, 'వికసిత భారత్ 2047' అనే ఉమ్మడి లక్ష్యాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్‌తో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు.

## కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లకు శిక్షణ శిబిరం

**శిబిరంలో పాల్గొన్న బోడుప్పల్ కాంగ్రెస్ నాయకులు.**



**మేడిపల్లి, జూన్ 11; (వార్త వేకువ)** : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సార్ కార్యక్రమంపై అవగాహన కల్పించడం కోసం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నియమించిన ప్రత్యేక ట్రైనర్ల ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమం మేడ్చల్ నియోజకవర్గంలోని అంతాయపల్లి ఎస్ఎస్ఆర్ వేద్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించబడింది. సమగ్ర, పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించడమే ప్రధాన లక్ష్యంగా నిర్వహించిన ఈ శిక్షణ శిబిరంలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి పద్మారెడ్డి, కొత్త చందర్ గౌడ్, బుక్కా సుమన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్త కిషోర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు పొన్నం తరుణ్ గౌడ్ పాల్గొన్నారు.మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని సుమారు 602 పోలింగ్ బూత్‌లకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, నిబంధనలు, బాధ్యతలపై అవగాహన పొందారు.

## స్వయం ఉపాధితో రాణించాలి



**నూతనకల్.. జూన్ 11 (వార్త వేకువ) :** యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధితో రాణించాలని తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి ఎస్సై ఆర్ నాగరాజు లు కోరారు. గురువారం మండల కేంద్రంలో పిఎంఈజిపి నిధులనుండి ఏర్పాటుచేసిన శ్రీ వెంకటేశ్వర బయో ప్రోడక్ట్ కంపెనీని స్థానిక సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగం సరిత సుధీర్ రెడ్డి ప్రొప్రైటర్ బూడిద సంధ్య అనంతుల మల్లేశ్వరి భూరెడ్డి సంజీవరెడ్డి కట్ట మల్లారెడ్డి భీమిడి యుద్ధంరెడ్డి అనంతుల వెంకన్న బూడిద శ్రీనివాస్ చురుకంటి చంద్రారెడ్డి మద్దెల సురేందర్ యాస శంకర్ రెడ్డి  కొలగాని వెంకన్న తదితరులున్నారు.

## అభం శుభం తెలియని 12 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసిన గౌస్ పాషాను శిక్షించాలి

**సర్పంచ్ కొండ్రు అంజమ్మ**



**భద్రాద్రి జిల్లా జూన్ 11 (వార్త వేకువ)** : ఖమ్మం పట్టణ కేంద్రంలో 12 ఏళ్ల బాలికపై అత్యాచారం జరిగిన దురదృష్టకర సంఘటన పై, గొందిగూడెం కొత్తూరు గ్రామపంచాయతీ, సర్పంచ్ కోండ్రు అంజమ్మ, విలేకరులతో మాట్లాడుతూ, ఖమ్మం జిల్లా తల్లంపాడు,చాకలి వృత్తి చేసుకునీ జీవనం సాగిస్తున్న అభం శుభం ఎరుగని 12 ఏళ్ల బాలికపై,ఖమ్మం పట్టణానికి చెందిన గౌస్ పాషా, అత్యాచారానికి పాల్పడి హత్య చేయాలని, చూశాడు.ఈ సంఘటన చాలా బాధాకరమైన విషయం, 12 ఏళ్ల బాలిక తీవ్ర గాయాలతో,పడి, హాస్పటల్, ప్రాణాపాయ స్థితిలో ఉండి పోరాడుతోంది. ప్రభుత్వం అన్ని విధాలుగా చాకలి వృత్తి చేసుకొని జీవనోపాధి కోసం పొట్ట చేత పట్టుకొని ఖమ్మం పట్టణంలో, ఒక అపార్ట్మెంట్లో, వాచ్ మెన్, గా పనిచేస్తున్న, కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని, ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, సర్పంచ్ కొండ్రు అంజమ్మ, కోరారు. ఈ ఘటనపై సర్పంచ్, అంజమ్మ, తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ,"అత్యాచారానికి పాల్పడిన మానవ మృగం, గౌస్ పాషా,కు ఉరిశిక్ష విధించాలని, సర్పంచ్ అంజమ్మ డిమాండ్ చేశారు.

## మణుగూరు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ గా రాజేశ్వరరావు



**భద్రాద్రి జిల్లా, జూన్ 11 (వార్త వేకువ)** : అశ్వాపురం మండల కేంద్రంలో డిప్యూటీ తహశీల్దార్ గా పనిచేసిన మహిపతి రాజేశ్వరరావు, మణుగూరు పట్టణానికి, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్, గా బదిలీ అయ్యారు. గతంలో అశ్వాపురం తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ గా మూడు సంవత్సరాలు, తర్వాత కొద్ది నెలలుగా డిప్యూటీ తాహశీల్దార్ గా విధులు నిర్వహిస్తూ, తమకంటూ మండలంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న రాజేశ్వరరావు, మండలంలోని అందరితో స్నేహపూర్వక సంబంధాలు ఉన్న అధికారిగా మంచి విలువలు ఉన్న వ్యక్తిగా గుర్తింపు. ఎలాంటి సమస్యలైనా చాకచక్యంతో పరిష్కరించే అధికారిగా తనదైన శైలిలో విధి నిర్వహణలో సమస్యలు పరిష్కరిస్తూ, మండలంలో  ప్రజలందరి మన్ననలు పొందారు.  భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ప్రజలకు మరెన్నో సేవలు అందించాలని కోరారు.

# అంజనాపురం గ్రామసభలో గందరగోళం

**సమస్యలను అడుగుతుండగానే గ్రామసభను ముగించిన అధికారులు మరియు సర్పంచ్**

**గ్రామ సభకు హాజరైన పాల్వంచ డిఎస్పి**

**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు జూన్ 11 (వార్త వేకువ) :** బూర్గంపాడు మండల పరిధిలోని అంజనాపురం గ్రామ పంచాయతీ బుధవారం జరిగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభను నిర్వహించగా కొంత గందరగోళం వాతావరణం నెలకొంది గ్రామసభకు సర్పంచ్ పాలకవర్గం మండల అధికారులు పాల్గొని మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరిస్తూ అంటువ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని గ్రామంలో ఉన్నటువంటి పిచ్చి మొక్కలు తొలగించాలని ప్లాస్టిక్ వ్యర్థలను తొలగించాలని సూచించారు.త్రాగునీరు వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలని దాని నుండి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చునని తెలిపారు.వర్షాకాలంలో ఎప్పుడు బ్లీచింగ్, అయిల్ ని అందుబాటులో ఉంచుకోవాలని డ్రైనేజీ క్లీనింగ్ చేయించాలని వీధిదీపాలను ఎప్పుడు వెలిగేలా చూసుకోవాలని తెలియజేశారు.  సురక్షితమైన మిషన్ భగీరథ ద్వారా అందించే త్రాగునీరు తాగాలని ట్యాంకులు పది రోజులు ఒకసారి శుభ్రపరచుకోవాలని తెలిపారు. వన సంరక్షణ అందరి బాధ్యత అని



ప్రజల సహకారంతో మొక్కలు నాటి సంరక్షించాలని వచ్చే తరాలకు పచ్చదనాన్ని అందించాల్సిన బాధ్యత అందరి మీద ఉందని తెలిపారు. వర్షాకాలంలో వృద్ధులు చిన్న పిల్లలకు ఇమ్యూనిటీ పవర్ తక్కువగా ఉంటుందని వారికి అంటూ వ్యాధులు త్వరగా సోకే ప్రమాదం ఉందని తెలిపారు. ఎప్పుడు పరిశుభ్రంగా ఉంటూ విధులను శుభ్రంగా ఉంచాలని తెలియజేశారు.  ఈ సంవత్సరం వర్షపాతం తక్కువగా ఉండే ప్రమాదం ఉందని దానివల్ల పంటలు సరిగా పండక పోవచ్చునని తెలియజేశారు. తొందరపడి రైతులు విత్తనాలు వేయకూడదని తొందరగా పంట చేతికి వచ్చే పంటను వేసుకోవాలని తెలియజేశారు.  గ్రామాల్లో సిసి రోడ్ల కంటే ట్రావెల్ రోడ్లకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని చిన్న పనులకు పంచాయతీ తీర్మానంతో బిల్లులు తీసుకోవాలని తెలియజేశారు.  రోడ్డు ప్రమాదాలను నివారించడం అందరి బాధ్యత అని రోడ్డు దాటే ముందు జాగ్రత్తగా చూసుకొని రోడ్డు దాటాలని టూవీలర్ డ్రైవ్ చేసేవాళ్లు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని ఫోర్ వీలర్ వారు సీట్ బెల్ట్ ను వాడాలని తెలియజేశారు.హెల్మెట్ వాడడం శిరోభారం కాదని ప్రాణానికి రక్షణ కవచమని కొనియాడా రు.

**గ్రామాల్లో ప్రధాన సమస్యలు**

**సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం**

**స్వచ్ఛమైన త్రాగునీరు అందడం లేదని**

చెత్తను తొలగించడంలో పంచాయతీ వారు విఫలమవుతున్నారని వాటర్ ట్యాంక్ ను శుభ్రపరచడం లేదని గ్రామ ప్రజలు ముక్తకంఠంతో ప్రశ్నించగా వారి సమస్యలను గ్రామ సర్పంచ్ మండల అధికారులను తెలియజేస్తూ ప్రజలు యువకులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక మండల అధికారులు పంచాయతీ సర్పంచ్ అర్ధాంతరంగా గ్రామసభను ముగించడం ప్రజాస్వామ్యాన్ని హేళన చేయడమేనని గ్రామ ప్రజలు యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు యువకులు వారి సమస్యలను చెప్పడంతో గ్రామ సర్పంచ్ కొంత అసహనానికి గురయ్యారు.అందరికీ సమాధానం చెప్పలేక గ్రామసభను ముగించడంతో గందరగోళం వాతావరణం ఏర్పడింది.  గ్రామ సభకు సర్పంచ్ నరసింహ, పాల్వంచ డిఎస్పి సతీష్ కుమార్ ఎంపీడీవో జమల రెడ్డి , బూర్గంపాడు ఎస్సై మెడ ప్రసాద్, పంచాయతీ పాలకవర్గం, ఎంఈఓ, జిపిఓ, సిహెచ్ఓ, ఏవో శంకర్, హౌసింగ్ ఏఈ మండల అధికారులు గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్ల నిర్మాణానికి రూ 38 లక్షల రూపాయల జీహెచ్ఎంసీ సాధారణ నిధులు మంజూరు



**బడంగ్‌పేట్ సర్కిల్ జూన్ 11 (వార్త వేకువ) :** శ్రీ వేంకటేశ్వర కాలనీ కి సంబంధించి (పాత 4 వ వార్డు) అల్మాస్ గూడ గ్రామం,57 డివిజన్ నాదర్గుల్  కొత్తగా సీసీ రోడ్ల నిర్మాణానికి రూ 38 లక్షల రూపాయల జీహెచ్ఎంసీ సాధారణ నిధులు మంజూరు అయి టెండర్ ప్రక్రియ పూర్తి కావటం జరిగింది. సంబంధిత కాంట్రాక్టర్ త్వరలో పనులు మొదలు పెట్టనున్న నేపథ్యంలో ఈ రోజు  కాలనీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి మరియు అసోసియేషన్ సభ్యులు,కాలనీ వాసుల తో కలిసి కాలనీ లో పర్యటించటం జరిగింది. ఈ సందర్భ ంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ఈ నిధులతో రెండు రోడ్లకి సంబంధించి పనులు పూర్తి కాబోతున్నాయి అని సంతోషం వ్యక్తం చేశారు.కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ గత ఫిబ్రవరి నెలలో కాలనీ అధ్యక్షుడు మధు సూదన్ రెడ్డి ఇంకా కొంత మంది సభ్యులతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లా రెడ్డి గారి ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇంచార్జ్ కీచన్న లక్ష్మా రెడ్డి గారిని కలిసి వెంకటేశ్వర కాలనీ లో అంతర్గత రోడ్లు పెండింగ్ లో ఉన్నాయి అని అధ్వాన రోడ్లతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటికి సంబంధించి తగిన నిధులు విడుదల చేయించటానికి కృషి చేయాలని కోరగా వెంటనే స్పందించి సమస్యను పరిష్కరిస్తామని ఈ విషయమై ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకు వెళ్లి అభివృద్ధికి తగిన నిధులు మంజూరు చేయిస్తామని కే ఎల్ ఆర్ హామీ ఇవ్వటం జరిగింది.  కె ఎల్ ఆర్ హామీ ఇవ్వటం ఆ తర్వాత వారం రోజుల్లో శంషాబాద్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు బడంగ్ పేట్ సర్కిల్ అధికారులు కాలనీ కి వచ్చి రోడ్లకి సంబంధించి అంచనాలు వేసి సంబంధిత అధికారుల కి పంపించటం ఆ వెంటనే నిధులు మంజూరు చేయడం జరిగింది. కాలనీ అభివృద్ధికి 38 లక్షల రూపాయల నిధులు కేటాయించటంతో సీఎం రేవంత్ రెడ్డికి,ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబుకి, నియోజకవర్గ ఇంచార్జ్ కె.ఎల్.ఆర్ గారికి, జోనల్ కమిషనర్ చంద్రకళ గారికి, బడంగ్ పేట్ సర్కిల్ అధికారులకు, స్థానిక బడంగ్ పేట్ సర్కిల్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లా రెడ్డి గారికి వెంకటేశ్వర కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మధు సుధన్ రెడ్డి తో పాటు కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు దయాకర్ రెడ్డి,రాము నాయక్, శ్రీకాంత్ రెడ్డి,వంశీధర్,జనార్దన్ రెడ్డి,శ్రీనాథ్ చారి,రమేష్ బాబు,రవి,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో నీటి నిల్వ (వాటర్ లాగింగ్) ప్రాంతాల గుర్తింపు



**బడంగ్‌పేట్ సర్కిల్ జూన్ 11 (వార్త వేకువ):** మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు, మాజీ మంత్రి శ్రీమతి సబితా ఇంద్రా రెడ్డి గారి ఆదేశాల మేరకు బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని 60వ డివిజన్‌లో వర్షపు నీరు నిలిచే (వాటర్ లాగింగ్) ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగింది. ఈరోజు (గురువారం) డివిజన్ పరిధిలోని ప్రధాన కూడళ్లయిన విశాల్ మార్ట్ పరిసరాలు, మరియు చందనం చెరువు – ఎస్ వై ఆర్ (ర్=) కన్వెన్షన్ సమీపంలో రోడ్లపై నీరు నిలిచిపోతున్న పాయింట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించడం జరిగింది. వర్షాకాలంలో నియోజకవర్గ ప్రజలకు, వాహనదారులకు రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మున్సిపల్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీస్, మరియు హైడ్రా (న్ణ=ూ) అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా మరియు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టనున్నారు.

## నేడు కల్వకుర్తి లో ఎమ్మెల్యే పర్యటన



**కల్వకుర్తి మున్సిపాలిటీ జూన్ 11 ( వార్త వేకువ) :** కల్వకుర్తి మున్సిపాలిటీ, అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు కళ్యాణ్ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం రేపు మధ్యాహ్నం 1గంటలకు కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేయడం జరుగుతుంది. 2గంటలకు డివిజన్ స్థాయి అధికారులతో రివ్యూ కార్యక్రమంలో కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి గారు పాల్గొననున్నారు. కావున కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు హాజరు కాగలరు అని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ కోరారు.

# సర్కారీ బడులను బతికిద్దాం

**తెలంగాణలో డప్పు చప్పుళ్లతో టీచర్ ఇంటింటి ప్రచారం**

**మహబూబాబాద్ జిల్లాలో ప్రభుత్వ బడుల్లో చేరికల కోసం టీచర్ ప్రచారం**

**డప్పు చప్పుళ్లతో ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను ఒప్పిస్తున్న ఉపాధ్యాయుడు**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ చర్యలను ప్రజలకు వివరిస్తున్న వైనం**

**ఊరికి గుడి ఎంత అవసరమో, బడి కూడా అంతేనంటూ గ్రామస్తులకు పిలుపు**

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, వాటిలో విద్యార్థుల నమోదును పెంచే లక్ష్యంతో తెలంగాణలో ఓ ఉపాధ్యాయుడు వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మహబూబాబాద్ జిల్లా పాటిమీది గూడెం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు వి. గోపీనాథ్, నూతన విద్యా సంవత్సరంలో పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరుతూ డప్పు చప్పుళ్లతో గ్రామమంతా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.కొంతమంది వాలంటీర్లతో కలిసి గ్రామ వీధుల్లో పర్యటిస్తూ, ఖరీదైన ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఆయన తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం విద్యార్థుల విద్యాభ్యాసం, పోషకాహారం కోసం చేపడుతున్న నూతన చర్యలను ఆయన ప్రజల్లోకి తీసుకెళుతున్నారు.  ఈ ప్రచారానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభిస్తుండగా, పలువురు తమ



పిల్లలను ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ, గ్రామానికి గుడి ఎంత ముఖ్యమో, ప్రభుత్వ బడి కూడా అంతే అవసరమని పేర్కొన్నారు.  ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడానికి రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు ఇటువంటి కృషి చేస్తున్నారని, బడిలో పిల్లలను చేర్పించి తమ ఊరి బడిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులపైనే ఉందని ఆయన స్పష్టం చేశారు.ఆయన చేపట్టిన ఈ చొరవ, రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో చేపడుతున్న విస్తృత సంస్కరణలకు అద్దం పడుతోంది. నూతనంగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు, ఉపాధ్యాయులకు ఏఐ టూల్స్ వంటి ఆధునిక సాంకేతికతలో శిక్షణ, స్మార్ట్ క్లాస్‌రూమ్‌ల ఏర్పాటు వంటి చర్యలతో అధికారులు ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మారుస్తున్నారు. గోపీనాథ్ వంటి ఉపాధ్యాయుల నిబద్ధత, ప్రభుత్వ ప్రయత్నాలకు తోడవ్వడం సర్కారీ బడుల పునరుజ్జీవానికి బాటలు వేస్తోంది.

# ఒక్క వర్షానికే బయటపడిన అధికారుల సమన్వయలోపం!

**రానున్న రోజుల్లో నగర పరిస్థితేంటి**

**హైడ్రా, కార్పొరేషన్ల మధ్య కొరవడిన సమన్వయం**

**ఇటీవల కురిసిన వర్షంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు**



అర్ధరాత్రి వరకు రోడ్లపై 3 లక్షల మంది వాహనదారులు వర్షాలొస్తున్నాయంటూ అన్ని విభాగాలతో సమన్వయ సమావేశాలు నిర్వహించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్, తన సంస్థ ఆధ్వర్యంలో జరగాల్సిన సన్నద్ధతపై దృష్టి సారించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్షాకాలం సీజన్? మొదలయ్యాక అత్యవసర బృందాలు, ఇతర యంత్రాంగం ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించారు. హైడ్రా హడావుడి చూసి అన్ని పనులను హైడ్రా చూసుకుంటుందనే భావనతో వర్షాలపై 3 కార్పొరేషన్లు చేతులెత్తేశాయి. గతంలో నగరంలో జీహెచ్ఎంసీ (గ్రేటర్ హైదరాబాద్? మున్సిపల్ కార్పోరేషన్) ఒక్కటే ఉండేది. తర్వాత హైడ్రా వచ్చింది. తాజాగా మరో రెండు కొత్త కార్పొరేషన్లు ఏర్పాటయ్యాయి. కానీ ప్రజలు పడుతున్న ఇబ్బందిలో మాత్రం ఎలాంటి మార్పులేదని మంగళవారం కురిసిన వర్షంతో స్పష్టమయింది. ముంపులో చిక్కుకొని సుమారు 3 లక్షల మంది వాహనదారులు అర్ధరాత్రి వరకు రోడ్లపై పడిగాపులు కాసి, నానా అవస్థలూ పడితే అధికారులు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది.మే నెల మొదలైనప్పట్నుంచే హైడ్రా ఆధ్వర్యంలో వర్షాకాల సన్నద్ధతపై సమావేశాలు మొదలయ్యాయి. వివిధ శాఖల అధికారులతో కమిషనర్ రంగనాథ్ తీసుకోవాల్సిన చర్యలు, శాఖల బాధ్యతలపై పలు కీలక సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఆశించినట్లుగా లేకపోవడం గమనార్హం.నాలాలు, పూడికతీతలో సన్నద్ధత లేక : రహదారులపై వరద నీరు నిలవకుండా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన వరద నాలాల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడం, డ్రైనేజీల పూడికతీత సరిగా జరగకపోవడం, సమస్యను సరిదిద్దే అత్యవసర బృందాలను ఏర్పాటు చేయకపోవడమే ముంపునకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. హైటెక్స్ వద్దనున్న జూబ్లీ గార్డెన్ రోడ్? నం.8లో భారీ వర్షం కురిస్తే గతంలో 20 నిమిషాల పాటు వరద నిలిచేది. జూన్ 9న నాలుగు గంటల పాటు కాలనీ వరదలో చిక్కుకుంది. వాసవి టవర్స్, మీనాక్షి టవర్స్, ఇతరత్రా భారీ బహుళ అంతస్తుల ప్రాజెక్టులన్నీ పూర్తవడంతో వరద నీటి ప్రవాహ మార్గాలన్నీ కూడా మూసుకుపోయాయి. వరద నాలాల నిర్మాణంపై ఆలోచించకుండా అధికారులు అనుమతులివ్వడం, ఇంజినీర్లు రోడ్లు వేయడంతో తలెత్తిన సమస్య ఇది.రాగల మూడు రోజులు మోస్తరు వర్షాలు : రాబోవు నాలుగు రోజుల్లో నైరుతి రుతుపవనాలు తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు విస్తరించే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. బంగాళాఖాతం మధ్య ప్రాంతం నుంచి తెలంగాణ మీదుగా కర్ణాటక వరకూ ఉపరితల ద్రోణి కొనసాగుతోందని వివరించింది. ఉత్తర్‌ప్రదేశ్ నుంచి విదర్భ వరకూ 900 మీటర్ల ఎత్తున మరో ఉపరితల ద్రోణి ఏర్పడిందని ఐఎండీ తెలిపింది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో ఇవాళ్టి నుంచి మూడ్రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నట్లుగా వెల్లడించింది. బుధవారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ పలు జిల్లాల్లో ఓ మాదిరి జల్లులు కురిశాయి. మంగళవారం ఉదయం 8 నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకూ భాగ్యనగరంలోని హిమాయత్‌నగర్‌లో 7 సెంటీమీటర్లు, గచ్చిబౌలిలో 5, గోల్కొండలో 3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

# ఏఐ టూల్స్ సాయంతో పీహెచ్ డీ థీసిస్‌ల తయారీ



**ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో పట్టేస్తున్న ఓయూ**

పీహెచ్‌డీ విద్యార్థులకు ప్రొఫెసర్ల హెచ్చరికలు – ఉస్మానియా వర్సిటీలో ఏఐ చెకింగ్ సాఫ్ట్‌వేర్ – పీహెచ్‌డీ థీసిస్‌లను కాపీ కొట్టారా లేదా అని టర్నిటిన్ సాఫ్ట్‌వేర్ ద్వారా గుర్తింపు టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక చాలా మంది పీహెచ్‌డీ విద్యార్థులు చాట్ జీపీటీ, జెమినై వంటి ఏఐ టూల్స్ సాయంతో థీసిస్‌లను సులభంగా తయారు చేసి కాలేజీల్లో సమర్పిస్తున్నారు. దీంతో చాట్‌జీపీటీ, జెమిని ఏఐ వంటి కృత్రిమ మేధ సాయంతో రీసెర్చ్ పత్రాలు సమర్పిస్తున్న పీహెచ్‌డీ విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు చెక్ పెడుతున్నారు. వీరు సమర్పించిన పీహెచ్‌డీ థీసిస్‌లను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో టెస్ట్? చేసి సొంతంగా పరిశోధన చేసింది కాదని కచ్చితంగా గుర్తిస్తున్నారు. పీహెచ్‌డీ థీసిస్‌లను సబ్మిట్ చేస్తున్నప్పుడు వాటిని ప్లాగియారిజం (నకలు గుర్తింపు ప్రక్రియ) ద్వారా పరీక్షించి థీసిస్‌ను మళ్లీ రాసుకొని తీసుకురావాలంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రెండేళ్లలో 600 థీసిస్‌లను పరిశీలించిన అధికారులు కొన్ని థీసిస్?లలో మార్పులు, చేర్పులు చేయాలంటూ సూచిస్తున్నారు.ఉస్మానియాలో అత్యాధునిక సాఫ్ట్‌వేర్ : విద్యార్థులు సమర్పిస్తున్న థీసిస్‌లలో పరిశోధన అసలైందా కాదా అని గుర్తించేందుకు ఉస్మానియా యూనివర్సిటీలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను గతేడాది జులై నుంచి వినియోగంలోకి తెచ్చారు. ఎంత శాతం కాపీ కొట్టారో అత్యాధునిక టర్నిటిన్ సాఫ్ట్‌వేర్ ద్వారా నిర్ధారిస్తున్నారు. ఏఐ టూల్ చాట్‌జీపీటీ ద్వారా పరిశోధన చేశారా? జెమినై ఏఐ ద్వారా అంశాలను తెలుసుకున్నారా? అన్న అంశాలను కేవలం పది నిమిషాల్లో అది పట్టేస్తుంది.కాపీ కొడితే పీహెచ్‌డీ సీటుకే ముప్పు : ఉస్మానియా యూనివర్సిటీ, జేఎన్‌టీయూ, హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీల్లో ఏటా సగటున 1,700 మంది పరిశోధక విద్యార్థులు వివిధ అంశాలపై పీహెచ్‌డీ థీసిస్‌లను సబ్మిట్ చేస్తున్నారు. టర్నిటిన్ సాఫ్ట్‌వేర్ సాయంతో పరీక్షించగా, 40 శాతం వరకు చాట్‌జీపీటీ సాయంతో సమర్పించినవే ఉండగా, మరో 5 శాతం వివిధ థీసిస్‌ల నుంచి కాపీ కొట్టినవే ఉంటున్నాయి. ఇకపై ఇలా చేస్తే మూడేళ్ల పాటు ఎక్కడా, ఎలాంటి పీహెచ్‌డీ సీటు రాకుండా చేస్తామంటూ విశ్వవిద్యాలయాల అధికారులు ఇటీవలే విద్యార్థులకు హెచ్చరికలు జారీ చేశారు. ఇంగ్లీషులో పదాల కూర్పు కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్?ను వినియోగిస్తే కాపీ పర్సెంటేజీ పెరిగే ప్రమాదముందని సూచిస్తున్నారు.టర్నిటిన్ సాఫ్ట్‌వేర్ పనితీరు ఇలా :టర్నిటిన్ సాఫ్ట్‌వేర్ చాలా వేగంగా, నిశితంగా పని చేస్తుంది. ఇది ఒకేసారి 400 పేజీల ఫైల్‌ను స్కాన్ చేసి తేల్చేస్తుంది.ప్రతి విద్యార్థి తమ థీసిస్‌ను ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా పరీక్షించి, సిస్టమ్ జనరేటెడ్ రిపోర్ట్ పొందడానికి కొంత ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.సాఫ్ట్‌వేర్ తనిఖీ చేసేటప్పుడు విద్యార్థులకు కొంత ఉపశమనం ఉంది. థీసిస్‌లోని బిబ్లియోగ్రఫీ, పట్టికలు, గ్రాఫ్‌లు, జనరిక్ టర్మ్స్, ఇండెక్స్, కొటేషన్లను ఈ ప్లాగియారిజం నుంచి మినహాయిస్తారు.'విద్యార్థులు థీసిస్ రూపొందించేటప్పుడు ఏఐ టూల్స్‌పై ఆధారపడటం తగ్గించి, క్షేత్రస్థాయిలో పరిశోధనలు, సొంత విశ్లేషణలు ఎక్కువగా చేయాలి. భాషా విజ్ఞానం కోసం నిపుణుల సహాయం తీసుకోవాలే తప్ప డిజిటల్ టూల్స్?పై అతిగా ఆధారపడకూడదు' అని ప్రొఫెసర్లు సూచిస్తున్నారు.

# గుట్టు చప్పుడు కాకుండా మత్తు దందా

**పోలీసుల అదుపులో గంజాయి కింగ్‌పిన్**

ఈగల్ అదుపులో గంజాయి స్మగ్లింగ్ కింగ్ పిన్ సొహైల్ – ఒడిశాలో గంజాయి పండించే వారితో సంబంధాల– మధ్యవర్తులతో సరకును ముందే నిర్ణయించిన ప్రాంతాలకు తరలింపువిజయవాడ నగరంలో పట్టుబడిన గంజాయి కేసులో తీగ లాగితే డొంక కదిలింది. గంజాయి మాఫియా కింగ్ పిన్ సొహైల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాలో గంజాయిని కొనుగోలు చేసి పలు రాష్ట్రాలకు సప్లయ్ చేస్తాడని పోలీసులు గుర్తించారు. సొహైల్‌తోపాటు మరో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సెకండ్ హ్యాండ్ కార్ల విక్రయాల ముసుగులో గుట్టు చప్పుడు కాకుండా మత్తు దందా చేస్తున్నాడని పోలీసులు గుర్తించారు.విజయవాడ శివారులో గంజాయి పట్టివేత: గంజాయి స్మగ్లింగ్ కింగ్‌పిన్ మహ్మద్ సొహైల్‌ను ఈగల్ బృందం అదుపులోకి తీసుకుంది. కేరళలోని మళప్పురం జిల్లాకు చెందిన సొహైల్ ఒడిశాలో గంజాయి పండించే ప్రాంతాలకు వెళ్లి నేరుగా వారితో సంబంధాలు పెట్టుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ చోటు నుంచి మధ్యవర్తుల సహాయంతో సరకును ముందే అనుకున్న ప్రాంతాలకు చేరుస్తాడన్నారు. తమిళనాడు, కేరళలో పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుని దందా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. సొహైల్‌తోపాటు ఆయన అనుచరులు ఒడిశాకు చెందిన అరూప్ సింగ్, రాజేష్ కుమార్ సింగ్‌లను కూడా వలపన్ని పోలీసులు పట్టుకున్నారు. తమిళనాడుకు తరలిస్తున్న 140 కేజీల గంజాయిని విజయవాడ శివారులో పోలీసులు పట్టుకున్నారు.సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారం: సొహైల్ దిల్లీ వెళ్లి పాత కార్లను కొని వాటిని కేరళలో అమ్ముతుంటాడని పోలీసులు తెలిపారు. ఒడిశా గజపతి జిల్లాకు చెందిన అరూప్ సింగ్ కేరళలోని పనస తోటల్లో పనిచేస్తుంటాడని వెల్లడించారు. ఒడిశాకే చెందిన అరూప్ స్నేహితుడు రాజేష్‌కుమార్ సింగ్ ఎర్నాకులంలోని ఓ కాంట్రాక్టర్ వద్ద ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. ముగ్గురికీ స్నేహం కుదిరిందన్నారు. ఒడిశాలోని కొరాపుట్‌తోపాటు గంజాయి సాగు చేసే పలు ప్రాంతాలకు నేరుగా వెళ్లి సొహైల్ కొనుగోలు చేస్తుంటాడని పోలీసులు తెలిపారు. అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు పంపిస్తుంటాడని చెప్పారు. ఇలా గంజాయి రవాణాలో కింగ్‌పిన్‌గా ఎదిగినట్లు వివరించారు. ముగ్గురు కలిసి ఈనెల 4వ తేదీన దిల్లీ వెళ్లారని అక్కడ రెండు పాత కార్లను కొనుగోలు చేసి బయలుదేరారని పోలీసులు తెలిపారు.



ఒడిశాలో 200 కేజీల గంజాయి కొనుగోలు చేసి ఇందులో 140 కిలోలను ప్యాక్ చేసి తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్లకు అప్పగించారన్నారు. కోయంబత్తూరుకు చేర్చినందుకు 30 వేలు ఇస్తామని వారికి ఆశపెట్టినట్లు తెలిపారు. మొదట కారులో గంజాయిని తరలించేందుకు పథకం వేసిన సొహైల్ నిఘా ఎక్కువగా ఉందని చివరకు లారీలోకి సరకు ఎక్కించినట్లు పోలీసులు తెలిపారు.పక్కా ప్రణాళికతో పట్టుకున్న పోలీసులు: మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఏర్పాటైన ఈగల్ విభాగం ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. రాష్ట్ర వ్యాప్తంగా గత 11 ఏళ్లుగా చీణూూ కేసుల్లో నిందితులుగా ఉన్న 40 వేల మంది డేటాను సేకరించింది. వీరిలో 20 వేల మంది వరకు కొంత చురుగ్గా ఉన్నారు. ఇటీవల జైలు నుంచి విడుదలైన నేరస్థులు, యాక్టివ్‌గా ఉన్న 4 వేల మంది కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టింది. తరచూ ఒడిశాలో గంజాయి సాగు చేసే ప్రాంతాలకు వెళ్తున్న సొహైల్‌పై ఈగల్ విభాగం దృష్టిసారించింది. పక్కా సమాచారంతో శ్రీకాకుళం నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు వివిధ జిల్లాల ఈగల్ అధికారులు, సిబ్బంది నెట్‌వర్క్‌గా ఏర్పడి సొహైల్ కదలికలను ట్రాక్ చేస్తూ అదుపులోకి విచారించారు. అనంతరం అరూప్ సింగ్, రాజేష్ కుమార్ సింగ్ లను రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రాబట్టిన వివరాల ఆధారంగా లారీ డ్రైవర్లు సెల్వం, ప్రదీప్ ద్వారా లారీలో గంజాయిని తరలిస్తున్నారని తెలుసుకుని పట్టుకున్నారు.

# తుని చిన్నారి అదృశ్యం ఘటన - బాలిక ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు

జ్ఞానేశ్వరి జాడ కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు – చిన్నారి కోసం పరితపిస్తున్న తల్లిదండ్రులు – జ్ఞానేశ్వరి తల్లిదండ్రులతో మాట్లాడిన ఎమ్మెల్యే యనమల దివ్య కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్ ఆగ్రహారంలో అదృశ్యమైన రెండేళ్ల బాలిక జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం ఐదో రోజు గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. చిన్నారి ఆచూకీ కోసం చేస్తున్న గాలింపు, దర్యాప్తుపై ఎమ్మెల్యే యనమల దివ్య అధికారులతో సమీక్షించారు. దర్యాప్తుకు సంబంధించిన వివరాలను అధికారులు, ఎమ్మెల్యేకు తెలియజేశారు. బాలిక తల్లిదండ్రులతో ఆమె మాట్లాడారు. వివరాలు అడిగి తెలుసుకుని ఓదార్చారు. పాపను సురక్షితంగా తీసుకొచ్చేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, అధైర్య పడొద్దని ధైర్యం చెప్పారు. తమ బిడ్డను సురక్షితంగా అప్పగించాలని తల్లిదండ్రులు యనమల దివ్యను కోరారు.తుని చిన్నారి అదృశ్యం ఘటన "సీహెచ్ అగ్రహారంలో రెండు సంవత్సరాల పసిపాప కనిపించకుండా పోయింది. జూన్ 6న మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. పాప ఆచూకీ కోసం పోలీసులు చాలా యాక్టివ్‌గా పనిచేస్తున్నారు. వందలాది మంది గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. – యనమల దివ్య, తుని ఎమ్మెల్యేఅసలేం జరిగిదంటే : తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సీహెచ్ అగ్రహారంలో అన్నిరెడ్డికి చెందిన తోటలో చిన్నబ్బాయి కుటుంబం కాపలాదారుగా ఉంటోంది.




చిన్నబ్బాయి కుమారుడు గణేష్, కోడలు భవానీ అక్కడే ఉంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం. పెద్ద కుమార్తె జ్ఞానేశ్వరి(ముద్దు పేరు బుజ్జమ్మ)కి ఇటీవలే రెండేళ్లు పూర్తయ్యాయి. శనివారం మధ్యాహ్నం తల్లిదండ్రులకు చిన్నారి కనిపించలేదు. కొండపై చిన్నారిని చూశానని పట్టుకునేందుకు ప్రయత్నించగా వెంట ఉన్న పెంపుడు కుక్క దాడి చేసే ప్రయత్నం చేసిందని ఓ వ్యక్తి తెలపడంతో ఆ ప్రాంతంలో గాలించారు. ఆదివారం రాత్రి వరకు ఆచూకీ లభ్యం కాలేదు.డ్రోన్ కెమెరాలతో గాలింపు : ఈ కేసును పోలీసులు సవాలుగా తీసుకున్నారు. మరోవైపు ఎన్డీఆర్ఎఫ్, అటవీశాఖ బృందాలు సైతం రంగంలోకి దిగాయి. ఎక్కడా చిన్న ఆధారమైనా లభ్యం కాకపోవడంతో జాగిలాలతో ప్రయత్నం చేశారు. చిన్నారి, పెంపుడు కుక్క కాలిముద్రల కోసం అన్వేషించారు. అత్యాధునిక డ్రోన్ కెమెరాలతోనూ అణువణువూ పరిశీలించారు. తుని, నర్సీపట్నం ప్రాంతాల్లో బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలో సీసీ కెమెరాల పుటేజీ జల్లెడ పట్టారు.మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా స్థానికంగా ఉన్న కొండపై నుంచి పెంపుడు కుక్క కిందకు రావడాన్ని పోలీసులు, స్థానికులు గుర్తించారు. పోలీసులు కుక్కను పట్టుకొనేందుకు ప్రయత్నించగా అది పలువురిపై దాడి చేసి కరిచి కొండపైకి వెళ్లింది. చిన్నారి ఆచూకీ ఏమైనా తెలుస్తుందేమోనని కొండపైకి వెళ్లి పోలీసులు పరిశీలిస్తున్నారు. మరోవైపు చిన్నారి తండ్రికి కారు లీజు విషయంలో ఇటీవల పలువురితో వివాదం ఉందన్న సమాచారంతో ఈ కోణంలోనూ పోలీసులు దృష్టి సారించారు. మరోవైపు సీహెచ్ అగ్రహారం ప్రధాన రహదారిలో ఎక్కడా సీసీ కెమెరాలు లేకపోవడం దర్యాప్తునకు ఇబ్బందిగా మారింది. పలువురు గ్రామస్థుల ఫోన్లు తనిఖీ చేశారు. ఎవరైనా బయట ప్రాంత వ్యక్తులు సంచరించారా అనుమానితులు ఉన్నారా అన్న కోణంలోనూ నిఘాబృందాలు పరిశీలించాయి. చిన్నారి కుటుంబసభ్యులను లోతుగా విచారించారు.

# హతమార్చేందుకు 8 నెలల క్రితమే ప్లాన్

**మాల్కాజి గిరిలో తుపాకీతో కాల్చి భార్య హత్య**





భార్యను తుపాకీతో కాల్చి చంపిన రియల్టర్ అరుణ్ కుమార్ – తుపాకీ శబ్దం విని పోలీసులకు సమాచారం ఇచ్చిన నిందితుడి తల్లి – మొదటి భార్య సోదరితో రెండో పెళ్లి హైదరాబాద్ మల్కాజిగిరి పరిధి మారుతీనగర్‌లో దారుణం జరిగింది. స్థిరాస్తి వ్యాపారి అరుణ్ కుమార్ తన రెండో భార్య నిషారాణిపై అనుమానంతో తుపాకీతో కాల్చి చంపాడు. ఈ ఘటన ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భార్య మీద అనుమానం పెంచుకున్న భర్త, ఆ కోపంతో రగిలిపోయి భార్య తలపై తుపాకీతో కాల్చి దారుణంగా హతమార్చాడు. ఆమెను చంపేందుకు దాదాపు 8 నెలల క్రితమే ప్లాన్ వేశాడు. తనకున్న పరిచయాల ద్వారా గత జనవరిలో బిహార్ నుంచి తుపాకీ తెప్పించాడు. బుధవారం ఉదయమే భార్యను హతమార్చి పరారయ్యాడు. మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఉదంతం ఒక్కసారిగా కలకలం రేపింది.గతంలోనే ప్లాన్ వేసి దొరికాడు : మల్కాజిగిరి మారుతీ నగర్‌కు చెందిన దామెర అరుణ్ కుమార్ (49) రియల్ ఎస్టేట్ వ్యాపారి. బొల్లారం ప్రాంతానికి చెందిన స్వర్ణలతతో అరుణ్‌కు 2002లో వివాహం జరిగింది. వీరికి సాయిహర్షిత, జోషిత్ సాయి అనే ఇద్దరు పిల్లలు. 2015లో స్వర్ణలత దురదృష్టవశాత్తు క్యాన్సర్ వ్యాధి బారిన పడింది. 2017లో గోడకూలిన ఘటనలో కుమార్తె సాయిహర్షిత మరణించింది. ఈ క్రమంలోనే అరుణ్ స్వర్ణలత సోదరి నిషారాణి(38)కి కొంత దగ్గరయ్యాడు.బంధువులతో ఫోన్, అనుమానం స్టార్ట్ : నిషారాణితో అరుణ్ సన్నిహితంగా ఉంటూ కొన్నాళ్లు హోటల్‌లో ఉంచడంతో విషయం తెలుసుకున్న స్వర్ణలత ఇంటి నుంచి వెళ్లిపోయింది. 2022లో నిషారాణిని అరుణ్ యాదగిరిగుట్టలో వివాహమాడాడు. ఈ క్రమంలోనే నిషారాణిపై అనుమానం పెరిగింది. ఆమె బంధువుతో తరచూ ఫోన్‌లో మాట్లాడుతోందని కక్ష పెట్టుకుని రగిలిపోయేవాడు. తరచూ వేధిస్తూ కొట్టడంతో నిషారాణి కూడా తన బంధువుల ఇంటికి వెళ్లిపోయింది. దీంతో అరుణ్ ఎలాగైనా ఆమెను హతమార్చాలనుకున్నాడు.2025 నవంబరు నెలలో అరుణ్ తన స్నేహితుడు కుషాయిగూడకు చెందిన మహమ్మద్ అబ్బుతో నిషారాణిని హతమార్చాలనుకుంటున్నట్లు చెప్పాడు. అబ్బు తనకు తెలిసిన యాకుత్‌పురా వాసి మీర్ ముజమ్మిల్‌ను అరుణ్‌కు పరిచయం చేశాడు. ముజమ్మిల్ తన బంధువు సల్మాన్‌తో కలిసి ఈ ఏడాది జనవరిలో బిహార్ వెళ్లి ఓ తుపాకీ తెచ్చి అరుణ్‌కు అందించాడు. అరుణ్ తుపాకీతో హైదరాబాద్ నగర శివార్లలో షూటింగ్ ప్రాక్టీస్ చేశాడు. మార్చి రెండో వారంలో అంబర్‌పేటలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో తుపాకీతో పట్టుబడి జైలుకు కూడా వెళ్లాడు. ఈ విషయం తెలిసిన నిషారాణి భయంతో పుట్టింటికి వెళ్లిపోయింది.జైలు నుంచి బయటకొచ్చి హత్య : జైలుకెళ్లిన అరుణ్ కుమార్ నెల తర్వాత బెయిల్?పై బయటకొచ్చాడు. బిహార్ నుంచి మళ్లీ మరో తుపాకీని కొనుగోలు చేశాడు. బంధువులతో ఒప్పించి నిషారాణిని ఎలాగోలా ఇంటికి తీసుకొచ్చాడు. బుధవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో భార్యతో గొడవపడి తలపై ఏకంగా 3 రౌండ్లు కాల్చాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. పక్క పోర్షన్‌లో నివాసం ఉంటున్న అరుణ్ కుమార్ తల్లి తుపాకీ శబ్దానికి బయటకు వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హత్య అనంతరం నిందితుడు పరారీలో ఉండగా, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# విమాన ప్రమాదం ఆ భయానక దృశ్యాలను గుర్తుచేసుకున్న గుజరాత్ డీజీపీ

**గతేడాది జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాద సహాయక చర్యలను గుర్తుచేసుకున్న గుజరాత్ డీజీపీ**

**ఈ దుర్ఘటనలో 260 మంది మృతి చెందగా, ఒక ప్రయాణికుడు ప్రాణాలతో బయటపడ్డాడు**

**తీవ్రమైన వేడి మధ్య సహాయక చర్యలు చేపట్టడం సవాలుగా మారిందన్న డీజీపీ**

**డీఎన్ఏ పరీక్షల ద్వారా వారాల్లోనే మృతులందరినీ గుర్తించామని వెల్లడి**



దేశ విమానయాన చరిత్రలోనే అత్యంత విషాదకర ఘటనల్లో ఒకటిగా నిలిచిన ఎయిర్ ఇండియా ఏఐ–171 విమాన ప్రమాదం జరిగి ఏడాది కావొస్తున్న నేపథ్యంలో, గుజరాత్ డీజీపీ జీఎస్ మాలిక్ ఆనాటి భయానక పరిస్థితులను, సహాయక చర్యలను గుర్తుచేసుకున్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఈ ప్రమాద సమయంలో సహాయక చర్యలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, మృతదేహాల గుర్తింపు ప్రక్రియ ఎంతటి సవాలుతో కూడుకున్నవో ఆయన వివరించారు.2025 జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ విమానం, టేకాఫ్ అయిన కొద్దిసేపటికే స్థానిక బీజే మెడికల్ కాలేజీ హాస్టళ్లపై కుప్పకూలింది. ఈ భీకర దుర్ఘటనలో విమానంలోని 242 మంది ప్రయాణికులలో 241 మందితో పాటు, నేలపై ఉన్న మరో 19 మంది కలిపి మొత్తం 260 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక ప్రయాణికుడు మాత్రం తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడటం గమనార్హం.ప్రమాదం జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడిన మాలిక్, ఆనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశం తన నివాసానికి కేవలం 200 మీటర్ల దూరంలోనే ఉందని, సమాచారం అందిన వెంటనే మధ్యాహ్నం 2 గంటల లోపే అక్కడికి చేరుకున్నానని ఆయన తెలిపారు. ప్రమాదం తర్వాత ఎగసిపడిన మంటల వల్ల సుమారు 1500 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైందని, ఆ తీవ్రమైన సెగలో సహాయక బృందాలు పనిచేయడం అత్యంత క్లిష్టతరంగా మారిందని గుర్తుచేసుకున్నారు.క్షతగాత్రులను తరలించే అంబులెన్సులు, మంటలను ఆర్పే ఫైర్ ఇంజిన్లు వేగంగా ఘటనా స్థలానికి చేరుకోవడానికి తక్షణమే గ్రీన్ కారిడార్లను ఏర్పాటు చేసినట్లు మాలిక్ వివరించారు. ఫోరెన్సిక్ బృందాల సమన్వయంతో డీఎన్ఏ పరీక్షల ప్రక్రియను వేగవంతం చేసి, కేవలం 20 గంటల వ్యవధిలోనే మొదటి మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించగలిగామని తెలిపారు. కొన్ని వారాల్లోనే డీఎన్ఏ మ్యాచింగ్ ద్వారా మృతులందరినీ గుర్తించామని ఆయన పేర్కొన్నారు. విమానం టేకాఫ్ అయిన తర్వాత ఇంజిన్ ఫ్యూయల్ స్విచ్‌లు 'కటాఫ్' పొజిషన్‌లోకి మారడమే ఈ ఘోర ప్రమాదానికి ప్రాథమిక కారణమని దర్యాప్తులో తేలినట్లు వెల్లడించారు.

# గుమ్మడికాయ చేసే మేలెంతో తెలుసా

**గుమ్మడికాయలో పోషకాలు అనేకం**

**ఆహారంలో భాగం చేసుకుంటే ఎన్ని లాభాలు ఉన్నాయంటున్న నిపుణులు**



గుమ్మడికాయ అనగానే హల్వా, పప్పు, సాంబార్, వడియాలు, సూప్ చేసుకోవడానికో ఉపయోగిస్తాం. కానీ, దీనివల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. ఇందులో మినరల్స్, విటమిన్స్, ఫైబర్ అధికంగా ఉంటాయని చెబుతున్నారు. ఈ క్రమంలో గుమ్మడికాయ వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం!

**కంటి ఆరోగ్యం :** క్యారెట్లు, ఆకుకూరలు, చిలగడదుంపల్లో మాదిరిగానే గుమ్మడికాయలోనూ బీటా కెరొటిన్ పుష్కలంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసే ఇది శరీరంలోకి చేరుకున్న తర్వాత విటమిన్ ఇూ రూపంలోకి మారిపోతుందని అధ్యయనం పేర్కొంది. విటమిన్ దృష్టిని కాపాడటానికి, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి , ఆరోగ్యకరమైన చర్మం, ఎముకలను నిర్వహించడానికి, కణాల పెరుగుదల, విభజనను నియంత్రించడానికి సహాయపడుతుందని తెలిపింది. ఇది గుండె జబ్బులు, కొన్ని క్యాన్సర్ల నుంచి కూడా రక్షణ కల్పిస్తుందని చెబుతుంది. అరకప్పు గుమ్మడి ముక్కలతోనే మనకు రోజుకు అవసరమైన విటమిన్ ఇూ లభిస్తుందని సూచిస్తున్నారు.

**క్యాన్సర్ నివారణ :** గుమ్మడికాయ గింజల్లో డయాబెటిస్ నిరోధక, క్యాన్సర్ నిరోధక లక్షణాలు ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో గుమ్మడికాయ గింజలలో లభించే జింక్, ఫాస్పరస్, మెగ్నీషియం, పొటాషియం, సెలీనియం మూలకాలు వాటిని పోషక శక్తి కేంద్రంగా, ఆర్థరైటిస్, వాపు, ప్రోస్టేట్ క్యాన్సర్‌లకు నివారణగా పనిచేస్తుందని అధ్యయనం పేర్కొంది.

**హైబీపీ అదుపులో :** గుమ్మడికాయలోని పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు రక్తపోటుని అదుపులోకి తీసుకొస్తుందంటున్నారు నిపుణులు. తద్వారా పక్షవాతం, గుండె సమస్యలు తగ్గుముఖం పడతాయని చెబుతున్నారు. అంతేకాదు, ఎముక సాంద్రత కూడా మెరుగవుతుందట. గుమ్మడికాయ గింజలలో లభించే అధిక మెగ్నీషియం, జింక్, అమైనో ఆమ్లాల వల్ల అధిక రక్తపోటు, గుండె జబ్బులు, అధిక రక్త చక్కెర ప్రమాదాన్ని తగ్గించవచ్చని ఎశ్రీవజవశ్రీఖఅఎశ్రీఱఅఱష అధ్యయనం పేర్కొంది.

**బరువు నియంత్రణ :** గుమ్మడిలో ఫైబర్ అధికంగా, కేలరీలు తక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో తయారు చేసిన ఆహార పదార్థాలను కొద్దిగా తీసుకున్నా వెంటనే కడుపు నిండిన భావన కలుగుతుందని పేర్కొంటున్నారు. ఫలితంగా, బరువు నియంత్రణలో ఉంటుందని, డైట్‌లో ఉన్నవారూ దీన్ని తినొచ్చని సూచిస్తున్నారు. అలాగే, మలబద్ధకం కూడా దూరమవుతుందని తెలియజేస్తున్నారు.

**మంచి నిద్ర :** గుమ్మడి గింజల్లో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుందట. ఇది శరీరంలో సెరోటోనిన్, మెలటోనిన్ వంటి నిద్ర హార్మోన్లను ఉత్పత్తి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో పడుకునే ముందు కొన్ని గుమ్మడి గింజలను తీసుకోవడం వల్ల నిద్ర నాణ్యత పెరుగుతుందని సూచిస్తున్నారు.

**రోగనిరోధక శక్తి బలోపేతం :** రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలు గుమ్మడిలో పుష్కలంగా ఉంటాయి. ఈ క్రమంలో బీటా కెరొటిన్‌తో పాటు విటమిన్ సి, విటమిన్ ఇ, ఐరన్, ఫోలేట్ కూడా గుమ్మడిలో ఎక్కువగా ఉంటాయంటున్నారు నిపుణులు. ఫలితంగా, వైరల్ ఇన్‌ఫెక్షన్లు, జలుబు, ఫ్లూపై పోరాడే శక్తి శరీరానికి లభిస్తుందని చెబుతున్నారు.

**అందానికీ మంచివట! :** గుమ్మడిలో ఉండే విటమిన్ సి కొలాజెన్‌ను ఉత్పత్తి చేసేందుకు తోడ్పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇది సూర్యుడి యూవీ కిరణాల నుంచి కాపాడుతుందని తెలియజేస్తున్నారు.గుమ్మడికాయ తినడం ఆరోగ్యానికి మంచిదే, కానీ అలర్జీ ఉన్నవారు తీసుకోకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు. అతిగా తీసుకున్నా శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుందని హెచ్చరిస్తున్నారు. క్యాండీలు, కేక్, ఫిల్లింగ్స్‌లోనూ గుమ్మడికాయని వాడతారని, అవి ఆరోగ్యానికి అంత మంచిది కాదని సూచిస్తున్నారు.

# విస్తరిస్తున్న కడుపు క్యాన్సర్ లక్షణాలు వెల్లడించిన నిపుణులు



ఎసిడిటీ, గ్యాస్ బాధల్ని మనం చాలాసార్లు పెద్దగా పట్టించుకోము. ఏదో ఒక యాంటాసిడ్ మాత్ర వేసుకుంటాము. అయితే, ఇవే బాధలు దీర్ఘకాలికంగా కొనసాగుతుండటం, వీటికి తోడు తరచూ పొట్టలో నొప్పి, బరువు తగ్గడం, మలంలో రక్తం వంటి లక్షణాలు కనిపిస్తుంటే నిర్లక్ష్యం చేయొద్దంటున్నారు నిపుణులు. ఇలాంటి లక్షణాల వెనుక ఒక్కోసారి ప్రమాదకర క్యాన్సర్లు దాగి ఉండే ప్రమాదం ఉందని హెచ్చస్తున్నారు. ఈ క్రమంలో కడుపు క్యాన్సర్ సూచించే హెచ్చరిక సంకేతాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!కడుపు క్యాన్సర్‌ను గ్యాస్ట్రిక్ క్యాన్సర్ అని కూడా పిలుస్తారు. కడుపులో క్యాన్సర్ కణాలు పెరగడం ప్రారంభించినప్పుడు ఇది సంభవిస్తుంది. ఇది కడుపులోని ఏ భాగంలోనైనా రావచ్చు. అయితే, చాలా సందర్భాలలో, కడుపు ప్రధాన భాగంలో ఇది కనిపిస్తుందంటున్నారు నిపుణులు. ఈ వ్యాధి సాధారణంగా నెమ్మదిగా మొదలవుతాయి. దీని ప్రారంభ సంకేతాలు ఎసిడిటీ, అజీర్ణం లేదా అప్పుడప్పుడు వచ్చే కడుపు నొప్పి వంటి సాధారణ జీర్ణక్రియ సమస్యలను పోలి ఉండటం వల్ల దీనిని గుర్తించడం చాలా కష్టం. అయితే, హెచ్చరిక సంకేతాలను ముందుగానే గుర్తించడం వల్ల చికిత్స ఫలితాలు మెరుగుపడతాయంటున్నారు నిపుణులు.

**నిరంతర అజీర్ణం :** ఉదర పై భాగంలో స్వల్పంగా ఎసిడిటీ లేదా మంట కలగడం సాధారణం. అయితే, ఇది పదేపదే లేదా నిరంతరం వస్తున్నప్పుడు, అది కడుపు క్యాన్సర్ సంకేతం కావచ్చంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో సాధారణంగా మంట లేదా అసౌకర్యమనేది బొడ్డు పైన అనిపిస్తుందట. సాధారణ యాంటాసిడ్లు లేదా జీవనశైలి మార్పులతో ఇది తగ్గకపోవచ్చుట. ఎటువంటి స్పష్టమైన కారణం లేనప్పటికీ, ఈ రకమైన అజీర్ణం వారాల పాటు లేదా నెలల తరబడి మళ్లీ మళ్లీ వస్తూ ఉంటుంది.

**కడుపు నిండినట్లు అనిపించడం :** తక్కువ పరిమాణంలో ఆహారం తీసుకున్నప్పటికీ, కడుపు నిండినట్లు అనిపిస్తుందని అష్ట్రం.బని అధ్యయనం పేర్కొంది. కడుపు విపరీతంగా నిండిపోయినట్లు, బిగుతుగా లేదా బరువుగా అనిపించడం వల్ల వ్యక్తి భోజనం మధ్యలోనే తినడం ఆపేయవచ్చంటున్నారు నిపుణులు. కడుపు పై భాగం లేదా మధ్య భాగంలో గడ్డ పెరగడం వల్ల ఇలా అనిపిస్తుందని చెబుతున్నారు.

**కారణం లేకుండా బరువు తగ్గడం :** డైటింగ్ లేదా వ్యాయామం చేయకుండానే బరువు తగ్గడం ఆందోళకరమైన విషయం. కడుపు క్యాన్సర్‌లో గడ్డలు అనేవి జీర్ణక్రియకు, పోషకాల శోషణకు అడ్డుపడటం వల్ల క్రమంగా బరువు తగ్గుతారని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో ఇది ఆకలిని కూడా తగ్గిస్తుందట. దీనివల్ల వ్యక్తి తక్కువగా తినొచ్చు. శరీరం క్యాలరీలను, పోషకాలను సమర్థవంతంగా గ్రహించలేకపోవచ్చుట. ఇది శరీరం కృశించిపోవడానికి, బలహీనతకు, కండరాల క్షీణతకు దారితీస్తుందట.

**నిరంతర కడుపు నొప్పి లేదా అసౌకర్యం :** కడుపు పైభాగంలో మొండిగా, నిరంతరంగా వచ్చే నొప్పి లేదా అసౌకర్యం మరొక ముఖ్యమైన సంకేతమని ఎవ్వతీష్ట్రముశ్రీష్ట్ర.జఱఎ.న్త్రశీజ. అధ్యయనం పేర్కొంది. తిన్న ఆహారం సరిపడక అప్పుడప్పుడు వచ్చే కడుపు నొప్పిలా కాకుండా, ఈ నొప్పి తగ్గకుండా వస్తుందట. అలాగే, కాలక్రమేణా నెమ్మదిగా తీవ్రమవుతుందట. ఇది సాధారణంగా బొడ్డుకు సరిగ్గా పై భాగంలో అనిపిస్తుందని చెబుతున్నారు. ఈ నొప్పి గడ్డ వల్ల గానీ, కడుపు లోపలి పొరపై పుండ్లు ఏర్పడటం వల్ల గానీ లేదా సమీపంలోని ఇతర అవయవాలపై ఒత్తిడి పడటం వల్ల గానీ రావచ్చు. కొన్నిసార్లు ఈ నొప్పి రాత్రి సమయాల్లో లేదా భోజనం చేసిన తర్వాత మరింత ఎక్కువగా అనిపిస్తుందట.

**వికారం, వాంతులు :** తరచుగా వికారం అనిపించడం లేదా భోజనం చేసిన తర్వాత పదేపదే వాంతులు కావడం కడుపులో సమస్య ఉన్నదనడానికి సంకేతం కావచ్చని ఎశ్రీవజవశ్రీఖఅఎశ్రీఱఅఱష అధ్యయనం పేర్కొంది. కడుపు క్యాన్సర్ ఉన్న కొన్ని సందర్భాల్లో, గడ్డ ఉదర ద్వారం వద్ద అడ్డుపడటం వల్ల పదేపదే వాంతులు అవుతాయని చెబుతున్నారు

**నల్లటి లేదా తారు రంగు మల విసర్జన లేదా మలంలో రక్తం :** నల్లగా, తారు రంగులో ఉండే మలం అనేది కడుపుతో సహా జీర్ణవ్యవస్థ పైభాగంలో రక్తస్రావం జరుగుతోందనడానికి సంకేతమంటున్నారు నిపుణులు. రక్తం ప్రేగుల గుండా ప్రయాణించేటప్పుడు నల్లగా మారుతుంది, ఇది కడుపులోని గడ్డ వల్ల కలిగే పుండును సూచిస్తుంది. కొన్నిసార్లు ఈ రక్తస్రావం చాలా నెమ్మదిగా జరిగి బయటకు స్పష్టంగా కనిపించకపోవచ్చు, కానీ ఇది రక్తహీనతకు దారితీస్తుంది. దీనివల్ల చర్మం పాలిపోవడం, బలహీనత, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగవచ్చు. మలంలో రక్తం నేరుగా కనిపించడం కూడా ఒక ప్రమాదకరమైన హెచ్చరిక సంకేతమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ప్రొటీన్ ఎక్కువగా తీసుకుంటున్నారా.. ఈ సైడ్ ఎఫెక్ట్స్ తప్పవు

మనిషి ఆరోగ్యానికి ప్రొటీన్ ఎంతో మేలు చేస్తుంది. కానీ, మోతాదు మించితే రక్తంలో కలిసే ప్రొటీన్ విషంగా మారుతుంది. అందుకే మనిషి బరువును బట్టి అవసరమైన ప్రొటీన్ ను లెక్కగట్టి తీసుకోవాలంటున్నారు నిపుణులు. కిలో శరీరబరువుకు 0.8 గ్రాముల ప్రొటీన్ మాత్రమే అవసరం. కాబట్టి మీ బరువును బట్టి మీకెంత ప్రొటీన్ అవసరమో లెక్క వేసుకోవచ్చు. బరువు తగ్గేందుకు, కండరాల నిర్మాణానికి, కణాల రిపేర్ చేయడానికి ప్రొటీన్ చాలా అవసరం. అయితే ప్రొటీన్ అధికంగా ఆహారాన్ని అపరిమితంగా తింటే మాత్రం ఆరోగ్య సమస్యలు వస్తాయి.



### దాహం పెరుగుతుంది

శరీరంలో ప్రొటీన్ ఎక్కువైతే శరీరం నీరసించి పోతుంది. తీవ్రమైన దాహం కలుగుతుంది. ఎందుకంటే.. అధిక ప్రొటీన్ వల్ల శరీరానికి ఎక్కువ నీరు కావాల్సి వస్తుంది. దాని వల్ల విపరీతమైన దాహం వేస్తుంది. దీనికి కారణం ప్రొటీన్లో ఉండే నత్రజని. ఇది అధికంగా రక్తంలో చేరడం వల్ల ఇలాంటి మార్పులు కలుగుతాయి. దీని వల్ల మూత్రపిండాలపై అధిక భారం పడుతుంది. వ్యర్థాలను బయటకు పంపేందుకు అధికంగా కష్టపడాల్సి వస్తుంది. ఎంత నీరు తాగిన శరీరానికి సరిపోదు. దీనివల్ల శరీరం బలహీనంగా మారిపోతుంది. తలనొప్పి ఎక్కువైపోతుంది. బరువు తగ్గి సన్నగా మారిపోతారు.

### నోటి దుర్వాసన దీని లక్షణమే..

చాలా మంది నోటి దుర్వాసనతో బాధపడుతుంటారు. ఇందుకు ఆహారంలో అధిక ప్రొటీన్ కూడా కారణమేనంటున్నారు. ప్రొటీన్లో ఉండే రెండు ఆమ్లాల తీవ్రమైన దుర్గంధాన్ని కలిగిస్తాయి. ఇందుకోసం కూడా అధికంగా నీళ్లు తాగాల్సి వస్తుంది.

### మలబద్ధకం

ప్రొటీన్ శరీరంలో అధికమైతే మలబద్ధకం సమస్య కూడా ఎక్కువవుతుంది. కార్బోహైడ్రేట్లు తగ్గి, ప్రొటీన్ పెరిగితే మాత్రం ఈ సమస్య మరీ తీవ్రంగా మారుతుంది. ప్రొటీన్ ఉండే ఆహారం అధికంగా తిన్నామనిపిస్తే, కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారాన్ని అధికంగా తినాలి.

### ప్రొటీన్ అధికంగా ఉండే పదార్థాలు...

కొన్ని ఆహారాల్లో ప్రొటీన్ అధికంగా దొరుకుతుంది. మటన్, చికెన్, గుడ్లు , చేపలు, రొయ్యలు, పాలు, పెరుగు, చీజ్, నట్స్ (బాదం, జీడిపప్పు,వాల్నట్స్, గుమ్మడి గింజలు, నువ్వులు, సన్ ఫ్లవర్ గింజలు, టోఫు, అన్ని రకాల బీన్స్, శెనగలు... వీటన్నింటిలో ప్రొటీన్ ఉంటుంది.

### ఒంటి నొప్పులు..

ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలు శరీరంలో వేడిని కలిగిస్తాయి. ఉదాహరణకు చికెన్, గుడ్లు, రొయ్యలు వంటివి. వీటిని మోతాదుకు మించి తీస్కుంటే ఒంటి నొప్పులు వేధిస్తాయి.

# తిరుమల, విశాఖ ఎర్రమట్టి దిబ్బలకు అంతర్జాతీయ ఖ్యాతి

- యునెస్కో తాత్కాలిక జాబితాలో తిరుమల, ఎర్రమట్టి దిబ్బలు
- ప్రపంచ వారసత్వ గుర్తింపు దిశగా కీలక ముందడుగు
- భారత్ నుంచి మొత్తం ఏడు ప్రదేశాలకు చోటు
- జాబితాలో డెక్కన్ ట్రాప్స్, మేఘాలయ గుహలు కూడా
- ఎక్స్ వేదికగా ప్రకటించిన భారత ప్రతినిధి బృందం





ఆంధ్రప్రదేశ్‌లోని రెండు ప్రఖ్యాత సహజ సంపదలకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కే అవకాశం ఏర్పడింది. కలియుగ వైకుంఠంగా పేరుగాంచిన తిరుమల కొండలు, విశాఖపట్నంలోని ఎర్రమట్టి దిబ్బలు యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద తాత్కాలిక జాబితాలో చోటు సంపాదించుకున్నాయి. ఇది ప్రపంచ వారసత్వ హోదాను సాధించే దిశగా ఒక కీలకమైన ముందడుగు.భారత్ నుంచి మొత్తం ఏడు సహజ వారసత్వ ప్రదేశాలను యునెస్కో తన తాత్కాలిక జాబితాలో చేర్చినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. యునెస్కోలో భారత శాశ్వత ప్రతినిధి బృందం ఈ విషయాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా అధికారికంగా ప్రకటించింది. దీంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఈ రెండు ప్రదేశాలు ప్రపంచ పటంలో ప్రత్యేక గుర్తింపు పొందనున్నాయి.ఈ జాబితాలో ఏపీకి చెందిన ప్రదేశాలతో పాటు, మహారాష్ట్రలోని పాంచని-మహాబలేశ్వర్‌లోని డెక్కన్ ట్రాప్స్, కర్ణాటకలోని ఉడుపిలోని సెయింట్ మేరీస్ ఐలాండ్ క్లస్టర్, మేఘాలయలోని మేఘాలయన్ ఏజ్ గుహలు ఉన్నాయి. అలాగే, నాగాలాండ్‌లోని నాగా హిల్ ఓఫియోలైట్, కేరళలోని వర్కాల క్లిఫ్ కూడా ఈ జాబితాలో స్థానం దక్కించుకున్నాయని అధికారులు తెలిపారు. తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకోవడం ప్రపంచ వారసత్వ హోదా పొందడంలో మొదటి, కీలకమైన అడుగుగా భావిస్తారు.

**రమాయణం**

# అమ్మగార్లు.. అయ్యగార్లు

మొదట్లో మా ఇంట్లో వంటకు అయ్యగారు ఉండేవారు. అయితే, మేము మిడిల్ స్కూల్‌కు వచ్చేసరికి అమ్మే వంట చేసేది. ఏరోజూ ఏడెనిమిది మందికి తక్కువ కాకుండా తను వండాల్సి ఉండేది. అయినా.. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో వంటల కోసం అయ్యగార్లు, అమ్మగార్లూ వచ్చేవారు. 'ఆడ ఇక మా నాన్న తన అమ్మమ్మకూ, తాతయ్యకూ దత్తపుత్రుడు కనుక వాళ్లిద్దరికీ తద్దినాలు పెట్టేవాడు. అది చాలా ఖర్చు, శ్రమతో కూడిందైనా, నాన్న తన ఎనభై మూడో ఏట చనిపోయేదాకా.. సుమారు తన పద్నాలుగో ఏట నుంచీ.. అంటే డబ్బై ఏళ్లపాటు ఎంతో శ్రద్ధగా ఆబ్దికాలు పెట్టేవాడు. "ఎందుకు నానా ఈ తద్దినం పెట్టడం?!" అని ఓసారి అడిగాను. దానికి నాన్న ఎంతో ఓపిగ్గా.. "మనం రోజూ అన్నం తింటం గద! మరి పై లోకానికి పోయినోళ్లకు ఎవరు పెడతరు?! మనకు ఒక సంవత్సరం అయితె వాండ్లకు ఒకరోజు అన్నట్టు. అందుకోసం వాండ్లకు ఏడాదికొక్కసారి పిండాలు పెట్టాలె. దాన్ని కాకులకో, పక్షులకో పెడుతం. వాండ్లు పక్షుల రూపంల ఒచ్చి తినిపోతరని, అట్ల వాండ్ల దీవెనలు ఉంటయని పెద్దవాండ్ల నమ్మకం!"



అని చెప్పాడు. అట్లాగే ఇంకోమాట కూడా చెప్పాడు.. "పెద్దవాండ్ల విశ్వాసం కోసం అది చెయ్యాలె. ఆ పేరుతోటి ఆరోజు ఒక పదిమంది ఆకలితోటి ఉన్నవాండ్లకు భోజనం పెడితే బాగుంటదని నాకనిపిస్తది".. ఆ మాట నాకు ఇప్పటికీ గుర్తుంది. వారం ముందే ఓ జీతగాడిని వెంటపెట్టుకుని వెళ్లి కిరాణా సామాను తెచ్చేవాడు నాన్న. అప్పుడే కాదు.. నాన్న ఎప్పుడు ఇంట్లోకి సామాను తెచ్చినా నాకూ, అక్కకూ చెరో బిస్కట్ ప్యాకెట్ తెచ్చి ఇచ్చేవాడు. మేము వాటికోసమే ఎంతో ఆత్రంగా ఎదురు చూసేవాళ్లం. అదే మాకు చాలా గొప్ప ఔట్ సైడ్ ఫుడ్. అదికూడా తరచుగా ఉండేది కాదు. ఏదైనా ఇంట్లో చేసింది తినడమే! తద్దినం రోజు ఏడింటికల్లా మా పక్కఊరు చాగల్లు నుంచి సింహయ్యగారు, ఆయన కొడుకు కేశవయ్యగారు వచ్చేవారు. ఆరోజు వీలైనంత వరకూ నేను బడి ఎగ్గొట్టడం తప్పనిసరి అని వేరే చెప్పక్కర్లేదుగా! వాళ్లు వస్తూనే మడిపంచెలు కట్టుకుని వంటింట్లో దూరేవారు. అమ్మకు ఒక్క వంట తప్పేది కానీ, మిగతా అన్ని పనులూ పెరిగేవి. ఓ పది రకాల వంటకాల కోసం బోలెడు కూరగాయలు కోసి, మిగతా వంట సామానంతా సిద్ధం చేసి ఉంచేది. వాళ్లు పిలిస్తే చాలు.. "ఏం గావాలె అయ్యగారూ!" అంటూ సిద్ధంగా ఉండేది. దగ్గరి మూడు కుటుంబాల బంధువులు భోజనాలకు వచ్చేవారు. ఇంకా పదిమంది దాకా పనివాళ్లకు, ఆరోజున ఎందరొస్తే అందరు బిచ్చగాళ్లకు భోజనాలు పెట్టడం అమ్మవంతే అయ్యేది. మేము కాస్త పెద్దయిం తరువాత వడ్డనలు చేసేవాళ్లం. అప్పుడు గ్రైండర్లు, మిక్సర్లు లేవు గనుక.. అయ్యగార్లు పెద్దరోటి ముందు కూచుని పప్పు రుబ్బేవారు. వాళ్లు చేసే గారెలు భలే రుచిగా ఉండేవి. మమ్మల్ని వంట చేసేటప్పుడు ఆ దరిదాపులక్కూడా రానిచ్చేవారు కాదు. మాకేమో మగవాళ్లు ఎలా వండుతారో చూద్దామని కుతూహలం. "ఇటు దిక్కు రావొద్దు.. మడి!" అనేవారు. ఇంకొక బ్యాచ్ బ్రాహ్మలు వచ్చి ఏవో మంత్రాలు చదివి నాన్నచేత తద్దినం పెట్టించేవారు. తరువాత అందరం వరుసగా కింద చిన్న చాపల మీద కూచొని.. ముందు విస్తర్లు పరుచుకుని ఉంటే, వాళ్లే వడ్డన చేసేవారు. సింహయ్య గారు అప్పటికే చాలా పెద్దాయన. ఆయనకు వంగడం వచ్చేది కాదు. అన్నిటినీ నిలబడే అంతెత్తునుంచి తపుక్కున విస్తట్లో వేసేవాడు. అయినా మేము భయంతో ఏమీ అనేవాళ్లం కాదు. ఆ తరువాత చాలా ఏళ్లపాటు కేశవయ్యగారు కూడా వచ్చేవాడు. నాన్న చనిపోయాక ఇక మా పుట్టింట్లో తద్దినాలు పెట్టడం ఆగిపోయింది. కొన్నాళ్లకు కేశవయ్యగారు మంచాన పడ్డాడని తెలిసి వెళ్లి చూసొచ్చాను. ఆయన పోయినా ఇప్పటికీ ఆ కుటుంబంతో టచ్‌లోనే ఉన్నాం. మా చిన్నప్పుడు కూనూరు నుంచి లక్ష్మయ్యగారు, వాళ్లన్నయ్య మత్స్యయ్యగారు మా ఇంటికి వచ్చి పోతుండేవారు. "గీ మత్స్యయ్య ఏం పేరు? గీయిన మనిషే గద.. చేప పేరు పెట్టుకున్నడేంది?!" అని అమ్మను అడిగాను. "నీకు కోతి మాటలు బాగ ఎక్కువయినయ్! శ్రీ మహావిష్ణువు దశావతారాలల్ల మొదటిది ఏంది?!" అన్నది అమ్మ. నాకు ఠక్కున గుర్తొచ్చింది. "తిరుపతి, యాదగిరి, సింహాచలం.. అని దేవుని గుళ్లుండే ఊరి పేర్లు పెట్టుకున్నట్టే.. మత్స్యగిరి, వరాహగిరి, కూర్మనాథం అని కూడా పెట్టుకుంటరు" అన్నది అమ్మ. అప్పుడర్థమైంది. ఇంతకూ ఈ మత్స్యయ్యగారి గురించి చెప్పొచ్చేదేంటంటే.. ఈయన ఎప్పుడూ మా అక్కాచెల్లెళ్లిద్దరి మధ్యలో ఏదోఒక గొడవో, పోటీనో పెట్టి తమాషా చూద్దామనుకునేవాడు. మేమేం తక్కువా?! ఆదర్శ అక్కాచెల్లెళ్లం మరి! మాకు పెద్దగా కొట్లాటలే వచ్చేవి కావు. ఆయన మా పుట్టినరోజులు గుర్తు పెట్టుకుని ఒకరోజు ముందుగానే వచ్చేవాడు. పుట్టినరోజంటే పెద్దగా కేక్ కట్‌చేయడం, స్నేహితుల్ని పిలవడం, సెలెబ్రేట్ చేయడం లాంటివి మాకు తెలియదు. ఆరోజు తలంటు పోసుకోవడం, ఉన్నంతలో కొత్త బట్టలు వేసుకోవడం చేసేవాళ్లం. అమ్మ ఏదైనా స్వీట్ చేసేది. ఈ మత్స్యయ్యగారు రాగానే.. "పోయినేడు మీ చెల్లె పుట్టినరోజుకు లడ్డూలు చేయించింది అమ్మ. మరి నీ పుట్టిన్రోజుకు ఏం చెయ్యాలె చెప్పు?! మీ అమ్మను అడుగు" అంటూ అక్కను రెచ్చగొట్టేవాడు. ఇక అక్క లడ్డూలు చేయించమని అమ్మ వెంటపడేది. ఆ తరువాత వచ్చే నా పుట్టినరోజు కూడా అంతే! "మీ అక్క పుట్టినరోజుకు లడ్డూలు చేసిన్రు. నీకు గూడ గవ్వే అయితె ఏం బావుంటది?! మంచిగ మైసూర్ పాక్ చేయించుకో.. అమ్మ తోటి చెప్పుపో!" అనేవాడు. "ఏం జెయ్యాల్నో అమ్మకు తెల్సు" అనేదాన్ని నేను. ఈయన కథ ఇలా ఉంటే.. అప్పుడప్పుడూ మా ఇంటికి కూనూరు నుంచి అండమ్మగారూ, లక్ష్మయ్యగారూ వచ్చేవారం. వాళ్ల ముచ్చట్ల గురించి వచ్చేవారం చెప్పుకొందాం!

# ఇరాన్‌ని శ్మశానంగా మార్చండి

### అమెరికా సైన్యానికి ట్రంప్ తాజా ఆదేశాలు

టెహ్రాన్ రియాక్షన్ ఏంటంటే పశ్చిమ ఆసియాలో ఇరు దేశాల మధ్య ఘర్షణ ఇప్పుడు నియంత్రణ దాటి అమెరికా-ఇరాన్ ముఖాముఖి యుద్ధంగా మారింది. హోర్ముజ్ జలసంధి సమీపంలో అమెరికా సైనిక హెలికాప్టర్‌ను ఇరాన్ కూల్చివేసిందన్న ఆరోపణల నేపథ్యంలో.. అమెరికా సైన్యం మంగళవారం దాడులు చేయగా, దానికి కొనసాగింపుగా బుధవారం ఇరాన్‌పై రెండో విడత భీకర దాడులు ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ దాడుల తీవ్రత యుద్ధాన్ని ముగించే ప్రయత్నాలను పూర్తిగా దెబ్బతీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో స్పందిస్తూ.. నిలిచిపోయిన శాంతి చర్చలకు టెహ్రాన్ (ఇరాన్) 'భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని' హెచ్చరించారు. ఇరాన్ చేస్తున్న అన్యాయమైన, నిరంతర దురాక్రమణకు ప్రతిస్పందనగానే తాము ఇరాన్‌లోని వాయు రక్షణ వ్యవస్థలు, భూ నియంత్రణ కేంద్రాలు, మరియు నిఘా రాడార్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. అయితే, అమెరికా జరిపిన ఈ దాడులలో ఇరాన్ దక్షిణ నగరమైన సిరిక్‌లోని రెండు ప్రధాన నీటి రిజర్వాయర్లు ధ్వంసమయ్యాయని, దీనివల్ల వేలాది మంది పౌరులకు తాత్కాలికంగా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని ఇరాన్ ఆరోపించింది. దీనిపై అమెరికా సైన్యం ఇంకా స్పందించలేదు. ఈ అమెరికా దాడులకు ప్రతికారంగానే తాము కువైట్, బహ్రెయిన్, జోర్డాన్‌లలోని అమెరికా సైనిక, వైమానిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసినట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. అమెరికా సైనిక విమానాలు ఉన్న తమ వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని దూసుకొచ్చిన ఐదు ఇరాన్ క్షిపణులను తాము విజయవంతంగా కూల్చివేశామని జోర్డాన్ తెలపగా, బహ్రెయిన్, కువైట్ దేశాలు కూడా తమపైకి వచ్చిన ఇరాన్ దాడులను సమర్థవంతంగా అడ్డుకున్నట్లు ప్రకటించాయి. ఈ పరిణామాలు ఇరాన్ సార్వభౌమాధికార ఉల్లంఘనే అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఖండించగా, ఈ తాజా దాడుల నేపథ్యంలో యుద్ధాన్ని ముగించేందుకు జరిపే చర్చలపై ఇరాన్ తన వైఖరిని పునఃసమీక్షిస్తుందని ఆ దేశ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ స్పష్టం చేశారు.అమెరికా స్థావరాలపై విరుచుకుపడిన ఇరాన్.. బతికుండాలంటే ఇక్కడి నుండి వెంటనే పారిపోండి అని తీవ్ర హెచ్చరిక.. ఈ యుద్ధం కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా కుదిపేయబడింది. అంతర్జాతీయంగా ఇంధన ధరలు ఆకాశాన్నంటాయి, ఫలితంగా ఆహారం, ఇతర నిత్యావసర వస్తువులు మరింత ఖరీదైనవిగా మారాయి. బుధవారం నాటి ట్రేడింగ్‌లో అంతర్జాతీయ ముడి చమురు ధర బ్యారెల్‌కు ఏకంగా 93 డాలర్లకు పైగా చేరుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్‌పై యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ముడి చమురు ధరలు 25 శాతం పైగా పెరగడం గమనార్హం. ఈ సంక్షోభం మధ్య ఒక ఆసక్తికరమైన విషయాన్ని డొనాల్డ్ ట్రంప్




వెల్లడించారు. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ దళాల కళ్లుగప్పి చమురు రవాణాను తరలించేందుకు గత నెల నుండి అమెరికా సైన్యం ఒక 'రహస్య మిషన్' చేపట్టిందని ఆయన తెలిపారు. ఇరాన్ రాడార్ పరికరాలను ధ్వంసం చేయడం ద్వారా రాత్రివేళల్లో నౌకలను రహస్యంగా పంపించి, జలసంధిపై ఇరాన్ పట్టును ఛేదించి సుమారు 100 మిలియన్ బ్యారెల్లకు పైగా చమురును బయటకు తరలించినట్లు ట్రంప్ పేర్కొన్నారు. దీనిపై అధికారిక సైనిక ధృవీకరణ లేనప్పటికీ, ఈ పరిమాణం యుద్ధానికి ముందు ఆ మార్గంలో జరిగే ఐదు రోజుల చమురు రవాణాకు సమానం. మరోవైపు ఇరాన్ చమురు రవాణా దిగ్బంధనాన్ని ఉల్లంఘిస్తూ చమురును తరలించేందుకు ప్రయత్నిస్తున్న పలావు జెండా కలిగిన 'ఎం/టి సెట్టెబెల్లో' అనే వాణిజ్య చమురు ట్యాంకర్‌పై అమెరికా యుద్ధ విమానం ఖచ్చితమైన ఆయుధాలతో దాడి చేసింది. ఇరాన్ తీరప్రాంత జలాల్లో అమెరికా దళాల చేతిలో దెబ్బతిన్న ఎనిమిదవ వాణిజ్య నౌక ఇది. ఈ నౌకపై అమెరికా దాడి చేసిన తర్వాత అందులోని ముగ్గురు భారతీయ నావికులు గల్లంతయ్యారని, మరో 21 మందిని రక్షించామని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. అయితే భారత్ తన ప్రకటనలో అమెరికా సైన్యం లేదా దిగ్బంధనం గురించి ప్రస్తావించలేదు. కాగా, ఓడపై కాల్పులు జరపడానికి ముందే తాము సిబ్బందిని హెచ్చరించామని అమెరికా సైన్యం తెలిపింది. యుద్ధాన్ని ముగించే ఒప్పందంపై సంతకం చేయాలని ట్రంప్ ఒకవైపు ఇరాన్‌ను కోరుతూనే, మరోవైపు ఇరాన్ జీర్ణించుకోలేని కఠినమైన డిమాండ్లను ముందుంచుతున్నారు. ఇరాన్ వద్ద ఉన్న అత్యంత సుసంపన్నమైన యురేనియం నిల్వలను (ఇవి ఆయుధ తయారీ స్థాయికి చాలా దగ్గరగా ఉన్నాయి) పూర్తిగా వదులుకోవాలని అమెరికా పట్టుబడుతోంది. కానీ ఇరాన్ ఇందుకు నిరాకరిస్తూ, తమపై ఉన్న ఆర్థిక ఆంక్షలను ఎత్తివేయాలని, స్తంభింపజేసిన తమ దేశ ఆస్తులను విడుదల చేయాలని కోరుతోంది. దీనికి ట్రంప్ అంగీకరించడం లేదు. "ఇరాన్ ఒప్పందానికి చాలా సమయం తీసుకుంటోంది, ఇక దానికి మూల్యం చెల్లించుకోక తప్పదు" అని ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' పోస్ట్‌లో హెచ్చరించారు. అలాగే, యుద్ధం ముగియాలంటే తమ మిత్రపక్షమైన లెబనాన్‌లోని 'హిజ్బుల్లా'పై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను కూడా ఆపాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. దీనికి భిన్నంగా ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ఇరాన్ మతపరమైన ప్రభుత్వ పతనం, దాని అణు కార్యక్రమ నిర్మూలన, హిజ్బుల్లా విధ్వంసమే లక్ష్యంగా లెబనాన్‌లో దాడులను మరింత తీవ్రం చేశారు. దక్షిణ లెబనాన్‌లోని టైర్ మరియు సైడాన్ నగరాలపై ఇజ్రాయెల్ జరిపిన తాజా వైమానిక మరియు డ్రోన్ దాడుల్లో మరో ఎనిమిది మంది మరణించారు. ఈ తీవ్ర ఉద్రిక్తతల నడుమ కూడా, ఖతార్ ప్రతినిధి బృందం బుధవారం చర్చల నిమిత్తం టెహ్రాన్‌కు చేరుకుని మధ్యవర్తిత్వ ప్రయత్నాలు కొనసాగిస్తోంది.

# పెట్రోల్‌పై కేంద్రం సంచలన నిర్ణయం

### అధిక ఇథనాల్ పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకం పూర్తిగా రద్దు




భారతదేశ ఇంధన భద్రతను పటిష్టం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం బుధవారం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దేశంలో ప్రత్యామ్నాయ ఇంధనాల వాడకాన్ని ప్రోత్సహించడానికి , విదేశాల నుండి దిగుమతి చేసుకునే ముడి చమురుపై ఆధారపడటాన్ని తగ్గించడానికి భారీ పన్ను రాయితీని ప్రకటించింది. ఇందులో భాగంగా, అధిక స్థాయిలో ఇథనాల్ కలిపిన పెట్రోల్‌పై విధిస్తున్న ఎక్సైజ్ సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తొలగించింది. ప్రభుత్వ తాజా నోటిఫికేషన్ ప్రకారం, 22 శాతం నుండి 30 శాతం వరకు ఇథనాల్ మిశ్రమం ఉన్న పెట్రోల్‌కు ఈ ఎక్సైజ్ సుంకం మినహాయింపు వర్తిస్తుంది. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద చమురు దిగుమతిదారు , వినియోగదారుగా ఉన్న భారతదేశం, తన విస్తృత ఇంధన వ్యూహంలో భాగంగా ఈ కీలక ముందడుగు వేసింది. సాధారణంగా దేశీయంగా తయారయ్యే వస్తువులు లేదా ఇంధనాలపై ప్రభుత్వం విధించే పరోక్ష పన్నును ఎక్సైజ్ సుంకం అంటారు. ఇప్పుడు అధిక ఇథనాల్ శాతం ఉన్న పెట్రోల్ ఇంధనంపై ఈ పన్నును రద్దు చేయడం ద్వారా, అటువంటి ఇంధన మిశ్రమాల తయారీ వ్యయం గణనీయంగా తగ్గుతుంది. ఇది చమురు ఉత్పత్తిదారులకు , సరఫరాదారులకు ఆర్థికంగా ఎంతో ఆకర్షణీయంగా మారడమే కాకుండా, మార్కెట్లో అధిక ఇథనాల్ ఇంధనాల సరఫరా , మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగవంతం కావడానికి లూబ్రికెంట్‌లా పనిచేస్తుంది. ప్రస్తుతానికి సాధారణ పెట్రోల్ బంకుల్లో విక్రయించే ఇంధన ధరల్లో ప్రభుత్వం ఎలాంటి తక్షణ మార్పులు ప్రకటించనప్పటికీ, భవిష్యత్ రవాణా రంగాన్ని స్వచ్ఛమైన ఇంధనాల వైపు నడిపించడంలో ఈ పన్ను సడలింపు ఒక బలమైన సంకేతంగా నిలుస్తుంది. భారతదేశం తన ఇంధన అవసరాల కోసం విదేశీ ముడి చమురు దిగుమతులపై విపరీతంగా ఆధారపడుతోంది. పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం వల్ల అంతర్జాతీయంగా చమురు ధరలు ఎప్పుడు పెరుగుతాయో తెలియని అనిశ్చితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో దేశీయంగా చెరకు, ధాన్యాలు వంటి వ్యవసాయ ముడి పదార్థాల నుండి తయారయ్యే ఇథనాల్ వాడకాన్ని పెంచడం వల్ల రెండు ప్రధాన ప్రయోజనాలు ఉన్నాయి. మొదటిది, విదేశీ శిలాజ ఇంధనాలపై ఆధారపడటం తగ్గి దేశ ఖజానాకు వేల కోట్ల రూపాయల దిగుమతి బిల్లు ఆదా అవుతుంది. రెండవది, అంతర్జాతీయ చమురు ధరల హెచ్చుతగ్గుల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై పడకుండా దేశాన్ని రక్షించవచ్చు. దీనితో పాటు, ఈ ఇథనాల్ మిశ్రణ కార్యక్రమం ద్వారా దేశీయ రైతులకు తమ పంట వ్యర్థాలకు అదనపు మార్కెట్ , ఆదాయం లభిస్తుంది. పెట్రోల్ కంటే రూ. 20 తక్కువ.. భారత్‌లో కొత్త ఇ85 ఇంధనం ప్రారంభం.. పూర్తి వివరాలు ఇవే.. గత దశాబ్ద కాలంగా భారతదేశం తన చమురు దిగుమతులను తగ్గించుకుంటూ, పర్యావరణహిత స్వచ్ఛమైన ఇంధనాలను ప్రోత్సహించే లక్ష్యంతో పెట్రోల్‌లో ఇథనాల్ శాతాన్ని క్రమంగా పెంచుకుంటూ వస్తోంది. దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న ఇంధన డిమాండ్‌ను సమతుల్యం చేయడానికి ప్రత్యామ్నాయ ఇంధనాలే సరైన మార్గమని ప్రభుత్వం బలంగా నమ్ముతోంది. సాధారణ వాహన వినియోగదారులపై ఈ నిర్ణయం యొక్క తక్షణ ప్రభావం పరిమితంగానే ఉన్నప్పటికీ, రవాణా రంగంలో దేశీయ ఇథనాల్ పాత్రను రికార్డు స్థాయికి చేర్చాలన్న భారతదేశ దీర్ఘకాలిక ప్రణాళికలో , 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యంలో ఈ పన్ను రద్దు నిర్ణయం అత్యంత కీలకమైన మైలురాయిగా మారనుంది.

# ఎల్పీజీ వినియోగదారులకు ప్రభుత్వం షాక్

### పైప్డ్ గ్యాస్ కనెక్షన్ తప్పనిసరి ,లేదంటే నోటీసులు!

దేశంలో ఎల్పీజీ (సిలిండర్) వినియోగదారులపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మీ ప్రాంతంలో ఇప్పటికే పైపుల ద్వారా సహజ వాయువు మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా? అయితే మీరు తప్పనిసరిగా పీఎన్‌జీ కనెక్షన్‌కు మారాల్సిందే. ఈ మేరకు అటువంటి గృహ వినియోగదారులను గుర్తించి, వంట అవసరాల కోసం పీఎన్‌జీ కి మారమని కోరుతూ నోటీసులు జారీ చేయాలని పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలను , సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలను ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి డాక్టర్ నీరజ్ మిట్టల్ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక అధికారిక లేఖ రాశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రెండు వర్గాల వినియోగదారులకు ఈ నోటీసులు జారీ చేయనున్నారు. మొదటి వర్గంలో, ఇప్పటికే ఇంట్లో పీఎన్‌జీ కనెక్షన్ ఉండి కూడా ఇంకా ఎల్పీజీ సిలిండర్ కనెక్షన్‌ను కలిగి ఉన్న కుటుంబాలు ఉన్నాయి. వీరు తమ ఎల్పీజీ కనెక్షన్‌ను వెంటనే ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. దీనివల్ల మార్కెట్లో సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్‌కు ఆస్కారం ఉండదని, విలువైన ఎల్పీజీ వృథా కాకుండా నివారించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఇక రెండవ వర్గంలో తమ ఇంటి సమీపంలో పీఎన్‌జీ లైన్లు ఉన్నప్పటికీ ఇంకా పాత పద్ధతిలోనే ఎల్పీజీ సిలిండర్లను వాడుతున్న వారు ఉంటారు. వీరందరినీ ఎల్పీజీ నుండి పీఎన్‌జీ కి మారేలా ప్రోత్సహించనున్నారు. ఈ ఆకస్మిక నిర్ణయానికి పశ్చిమ ఆసియా (మధ్యప్రాచ్యం) లో కొనసాగుతున్న భీకర సైనిక సంక్షోభమే ప్రధాన కారణం. యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన 'హోర్ముజ్ జలసంధి' గుండా నౌకాయానానికి తీవ్ర అంతరాయం కలిగింది. భారతదేశానికి వచ్చే ముడి చమురు దిగుమతులలో 40 శాతం, ఎల్ఎన్‌జీ లో 60 శాతం, మరియు ఎల్పీజీ దిగుమతులలో ఏకంగా 90 శాతం ఈ జలమార్గం ద్వారానే




జరుగుతాయి. భారత్ తన మొత్తం దేశీయ ఎల్పీజీ అవసరాలలో 60 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇందులో సింహభాగం ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ దేశాల నుండి హోర్ముజ్ జలసంధి ద్వారా వస్తుంది. ప్రయాణికులకు బిగ్ అలర్ట్.. రైల్వేని వెంటాడుతున్న గ్యాస్ కొరత.. ఎలక్ట్రిక్ కుకింగ్ వంట ప్రారంభించిన. ఈ సరఫరా అంతరాయాన్ని తట్టుకోవడానికి భారత్ తన దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని రోజుకు 32,000 టన్నుల నుండి 52,000 టన్నులకు (60 శాతం పైగా) పెంచింది. అలాగే అమెరికా, కెనడా, అల్జీరియా వంటి దేశాల నుండి అదనపు సరఫరాలను పొందుతూ దిగుమతులను వైవిధ్యపరిచింది. అయినప్పటికీ, పెరిగిన ధరల భారం వల్ల దేశంలో ఎల్పీజీ వినియోగం గతేడాది మే నెలతో (2.68 మిలియన్ టన్నులు) పోలిస్తే 2026 మే నాటికి 20 శాతం తగ్గి 2.13 మిలియన్ టన్నులకు పడిపోయింది. దిగుమతుల వ్యూహం మారడం వల్ల పెరిగిన అదనపు రవాణా ఖర్చులను భర్తీ చేయడానికి ప్రభుత్వం ఈ ఏడాది (2026) లోనే గృహ వినియోగ సిలిండర్ల ధరలను రెండుసార్లు పెంచింది. మార్చిలో రూ. 60, ఆ తర్వాత జూన్‌లో రూ. 29 పెంచడంతో ప్రస్తుతం 14.2 కేజీల గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ. 942 కి చేరింది. అలాగే హోటళ్లు, రెస్టారెంట్లు వాడే 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధర రూ. 3,113.50 వద్ద ఉంది. దేశంలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద రాయితీ పొందుతున్న 10.58 కోట్ల మందితో కలిపి మొత్తం 33 కోట్ల కుటుంబాలు ఎల్పీజీని వాడుతున్నాయి. ఢిల్లీలో ఉజ్వల లబ్ధిదారులు 14.2 కేజీల సిలిండర్ కోసం రూ. 642 చెల్లిస్తున్నారు. అయితే, ప్రభుత్వం వీరికి ఇచ్చే రాయితీ రీఫిల్‌ల సంఖ్యను సంవత్సరానికి 9 సిలిండర్ల నుండి ఏకంగా 4 సిలిండర్లకు తగ్గించేసింది. ధరలు ఇంతగా పెంచినప్పటికీ, ప్రస్తుతం విక్రయిస్తున్న ప్రతి గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్‌పై ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) సుమారు రూ. 690 భారీ నష్టాన్ని చవిచూస్తున్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ లేఖలో పేర్కొంది. ముఖ్యంగా ఉజ్వల యోజన సబ్సిడీ భారం ప్రభుత్వానికి ఏటా అదనంగా రూ. 19,000 కోట్లుగా మారుతోంది. ఈ నేపథ్యంలో సబ్సిడీ భారాన్ని తగ్గించుకోవడానికి, అలాగే పీఎన్‌జీ వినియోగాన్ని వేగవంతం చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. గ్యాస్ పైప్‌లైన్ నెట్‌వర్క్ అందుబాటులో ఉన్న చోటల్లా ప్రజలు పీఎన్‌జీ కి మారేలా చూడాలని, ఇందుకోసం జిల్లా కలెక్టర్లు, జిల్లా మేజిస్ట్రేట్లు, మున్సిపల్ కమిషనర్లు, స్థానిక సంస్థల అధికారులు సిటీ గ్యాస్ సంస్థలతో కలిసి క్షేత్రస్థాయిలో పని చేయాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. మౌలిక సదుపాయాలు ఉన్నప్పటికీ స్థానిక సమస్యలు, ప్రజల్లో అవగాహన లోపం వల్ల ఇప్పటివరకు పీఎన్‌జీ విస్తరణ మందగించిందని, ఇకపై స్థానిక యంత్రాంగం కఠినంగా వ్యవహరించి పైపుల గ్యాస్ పరివర్తనను వేగవంతం చేస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

# చివరి 41 నిమిషాల్లో కుప్పకూలిన స్టాక్ మార్కెట్

### ఇన్వెస్టర్ల కొంపలు ముంచిన అటమెరికా-ఇరాన్ యుద్ధం




ఉదయం దలాల్ స్ట్రీట్‌లో ట్రేడింగ్ ఎంతో ఆశాజనకంగా ప్రారంభమైంది. గత కొన్ని రోజులుగా వేధిస్తున్న అనిశ్చితికి తెరపడుతూ మార్కెట్లు స్థిరపడతాయని ఇన్వెస్టర్లు బలంగా నమ్మారు. దీనికి తగ్గట్టుగానే ప్రారంభంలో సెన్సెక్స్, నిఫ్టీలు లాభాల బాట పట్టాయి. బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లు మార్కెట్‌ను ముందుకు నడిపించాయి. అంతా సాఫీగా సాగుతుందనుకున్న తరుణంలో, మధ్యాహ్నం 2 గంటల సమయానికి వేలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న మధ్యప్రాచ్యం నుండి వచ్చిన ఒకే ఒక్క వార్త దలాల్ స్ట్రీట్ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేసింది.తమ అపాచీ హెలికాప్టర్‌ను కూల్చివేసినందుకు ప్రతీకారంగా ఇరాన్‌పై అమెరికా ఆత్మరక్షణ దాడులు ప్రారంభించిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ ధృవీకరించడంతో ప్రపంచ మార్కెట్లతో పాటు భారత మార్కెట్లను ఒక్కసారిగా భయం ఆవరించింది. ఫలితంగా, ట్రేడింగ్ ముగియడానికి సరిగ్గా చివరి 41 నిమిషాల్లో భారీ ఎత్తున అమ్మకాల ఒత్తిడి జరిగి, ఉదయం నాటి లాభాలన్నీ ఆవిరైపోయాయి.ఉదయం భారీ లాభాల్లో ఉన్న బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్, మార్కెట్ ముగిసే సమయానికి ఆ లాభాలన్నింటినీ కోల్పోయి కేవలం 64 పాయింట్ల స్వల్ప లాభంతో 73,983 వద్ద మాత్రమే నిలబడగలిగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 50 పరిస్థితి మరింత దారుణంగా మారింది. నిఫ్టీ ఉదయం నాటి లాభాలను ఏమాత్రం నిలబెట్టుకోలేకపోగా, కీలకమైన 23,250 మద్దతు స్థాయిని కోల్పోయి, చివరికి 27 పాయింట్ల నష్టంతో 23,215 వద్ద ముగిసింది. మార్కెట్ ఎంత బలహీనంగా ఉందో చెప్పడానికి ఎన్ఎస్ఈ అడ్వాన్స్-డిక్లైన్ రేషియోనే నిదర్శనం. నేడు మార్కెట్లో పరిస్థితి 1:3 గా నమోదైంది, అంటే మార్కెట్లో పెరిగిన ప్రతి ఒక్క షేరుకు బదులుగా మూడు షేర్లు నష్టాల్లో ముగిశాయి.ఈ పతనంలో నిఫ్టీని కిందకు లాగడంలో ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, హిండాల్కో, మరియు హెవీవెయిట్ స్టాక్ రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రధాన పాత్ర పోషించాయి. లార్జ్‌క్యాప్ స్టాక్స్ కొంతవరకు తట్టుకున్నప్పటికీ, మిడ్‌క్యాప్స్ తీవ్రంగా నష్టపోయాయి. ఇన్వెస్టర్లు రిస్క్ ఎక్కువగా ఉండే విభాగాల నుండి నిధులు వేగంగా వెనక్కి తీసుకోవడంతో నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఏకంగా 905 పాయింట్లు కుప్పకూలి 59,810 వద్ద ముగిసింది. ఇందులో ముఖ్యంగా మోర్గాన్ స్టాన్లీ రేటింగ్‌ను 'ఓవర్‌వెయిట్' నుండి 'అండర్‌వెయిట్'కు తగ్గించడంతో ఆయిల్ ఇండియా షేరు 10 శాతానికి పైగా పతనమైంది.కళ్యాణ్ జ్యువెలర్స్ 5 శాతం నష్టపోగా, సీఈఓ రాజీనామా నేపథ్యంలో న్యూజెన్ సాఫ్ట్‌వేర్ 3 శాతం పైగా క్షీణించింది. వీటితో పాటు ఎన్ఎల్‌సీ ఇండియా, ఇండియన్ బ్యాంక్, పీసీ జ్యువెలర్ కూడా నష్టాల బాట పట్టాయి. మరోవైపు ఐటీ రంగానికి ఆరో రోజు కూడా శాపం వెంటాడింది. అంతర్జాతీయ టెక్ మార్కెట్ల బలహీనత వల్ల టీసీఎస్ మినహా ఐటీ ఇండెక్స్‌లోని అన్ని స్టాక్‌లు రెడ్ మార్క్‌లోనే ముగిశాయి. బ్యాంక్ నిఫ్టీ కూడా చివరి నిమిషం అమ్మకాలతో 94 పాయింట్లు పడిపోయి 55,100 వద్ద స్థిరపడింది.అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల దెబ్బకు కేవలం భారత్ మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లు వణికిపోయాయి. అమెరికాకు చెందిన ఎస్‌డపి 500 ఫ్యూచర్స్ 0.50 శాతం, నాస్‌డాక్ 100 ఫ్యూచర్స్ 0.87 శాతం, డౌ ఫ్యూచర్స్ 140 పాయింట్లు పతనమయ్యాయి. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి ఏకంగా 4.52 శాతం కుప్పకూలగా, జపాన్ నిక్కీ 1.89 శాతం, చైనా సీఎస్ఐ 300 సూచీ 1.11 శాతం చొప్పున క్షీణించాయి.మరోవైపు, యుద్ధ భయాలతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. డబ్ల్యూటీఐ క్రూడ్ ఆయిల్ ధర 1 శాతం పెరిగి బ్యారెల్‌కు 89 డాలర్లకు చేరుకుంది. భారతదేశం లాంటి చమురు దిగుమతి దేశాలకు ఇది పెద్ద ఎదురుదెబ్బ, ఎందుకంటే ఖరీదైన చమురు వల్ల దేశంలో ద్రవ్యోల్బణం పెరగడమే కాకుండా, రూపాయి విలువపై ఒత్తిడి పెరుగుతుంది మరియు కార్పొరేట్ కంపెనీల లాభాలు దెబ్బతింటాయి.ఇంతటి మార్కెట్ పతనంలోనూ కొన్ని షేర్లు అద్భుతమైన ధైర్యాన్ని ప్రదర్శించాయి. అజెంట్రా సొల్యూసి డిజిటల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోవడంతో న్యూక్లియస్ సాఫ్ట్‌వేర్ షేరు 12 శాతం లాభపడగా, మెతాతో చేతులు కలపడంతో క్లీన్ మ్యాక్స్ స్టాక్ 10 శాతం ఎగబాకింది. మార్కెట్లో అత్యంత సురక్షితమైన రంగంగా నిలిచిన ఎఫ్ఎంసీజీలో కొనుగోళ్లు జరిగాయి, ముఖ్యంగా నెస్లే ఇండియా షేరు దాదాపు 2 శాతం లాభపడింది.

# బ్యాంకింగ్ రంగంలో రాబోయే పెను మార్పులు ఇవే!




ముంబై వేదికగా నేడు జరిగిన 'డేటా అండ్ జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమ్మిట్'లో పలువురు దిగ్గజాలు పాల్గొన్నారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ టెక్నాలజీ వల్ల కలిగే వాస్తవ ప్రయోజనాలపై చర్చించారు. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ వంటి సంస్థలు ప్రధానంగా పెట్టుబడిపై రాబడి, గవర్నెన్స్ అంశాలపై దృష్టి సారించాయి. స్థానిక బ్యాంకుల భవిష్యత్తుకు ఈ సదస్సు ఒక కీలక మలుపుగా నిలవనుంది. ఐసీఐసీఐ లాంబార్డ్ , ఎల్ అండ్ టీ ఫైనాన్స్ వంటి సంస్థలు క్లెయిమ్ ప్రాసెసింగ్ కోసం అత్యాధునిక టూల్స్‌ను ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నాయి. కోట్లాది మంది వినియోగదారులకు ఖచ్చితమైన సేవలు అందిస్తూనే, ఖర్చులను తగ్గించుకోవడం ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యం. అయితే, ఈ మార్పులతో డేటా ప్రైవసీ, నిబంధనల అమలు విషయంలో మరింత కఠినమైన చర్యలు తీసుకోనున్నారు. ప్రతి పైలట్ ప్రోగ్రామ్ విజయవంతమైతేనే వాటిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తారు. దీనివల్ల టెక్నాలజీపై పెట్టే ఖర్చు వృథా కాకుండా, పనితీరు మెరుగుపడుతుంది. రంగంలో మారుతున్న నియామకాలు.. గవర్నెన్స్‌పై ఫోకస్ ఆర్థిక రంగంలో ఉద్యోగాల నియామక ప్రక్రియలో వస్తున్న పెను మార్పులను ఈ సమ్మిట్ హైలైట్ చేసింది. చాలా సంస్థలు సంప్రదాయ ఉద్యోగాల భర్తీని తాత్కాలికంగా నిలిపివేసి, 'డేటా ఎథిక్స్' నిపుణుల కోసం వెతుకుతున్నాయి. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులు కూడా ఈ ఆటోమేటెడ్ సిస్టమ్స్‌తో కలిసి పనిచేసేలా తమ నైపుణ్యాలను పెంచుకోవాల్సి ఉంటుంది. టాటా ఏఐజీ వంటి సంస్థల్లో ఈ ట్రెండ్ కొత్త కెరీర్ అవకాశాలను సృష్టిస్తోంది. మారుతున్న మార్కెట్‌లో పోటీని తట్టుకోవడానికి ఇది ఎంతో అవసరం. ప్రాధాన్యత అంశం ఆశించిన ఫలితం కస్టమర్ సపోర్ట్ వేగవంతమైన స్పందన రిస్క్ మేనేజ్‌మెంట్ మెరుగైన క్రెడిట్ స్కోరింగ్ క్లెయిమ్స్ ప్రాసెస్ ఆటోమేటెడ్ వెరిఫికేషన్ ఉత్పాదకతను పెంచడంలో పాత్రపై యెస్ సెక్యూరిటీస్, టాటా క్యాపిటల్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.టూల్స్ మనుషులకు సహాయకారిగా ఉంటాయే తప్ప, వారి స్థానాన్ని భర్తీ చేయవని వారు స్పష్టం చేశారు. భారతీయ ఉద్యోగార్థులు సంక్లిష్టమైన డిజిటల్ వర్క్-ఫ్లోలను నేర్చుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ ఆవిష్కరణలు రిస్క్ మేనేజ్‌మెంట్‌లో సాయపడటమే కాకుండా, కస్టమర్లకు వ్యక్తిగత సలహాలు అందించడంలోనూ తోడ్పడతాయి. ఈ వ్యూహం వల్ల ఖర్చులు తగ్గడమే కాకుండా, కస్టమర్లలో నమ్మకం పెరుగుతుంది. సాంకేతికత మరింత పరిణతి చెందితే, భారతీయ ఆర్థిక రంగంలో సేవలు వేగవంతం కావడంతో పాటు మోసాలను సులభంగా గుర్తించవచ్చు. భవిష్యత్తులో రాణించాలంటే నిపుణులు డిజిటల్ అక్షరాస్యతపై దృష్టి పెట్టాలి. కంపెనీలు కూడా సురక్షితమైన వృద్ధిని, ప్రతి పెట్టుబడిపై స్పష్టమైన ఆర్థిక లాభాలను ఆశిస్తున్నాయి. ఇన్వెస్టర్లు, ఉద్యోగులు ఈ మార్పులను గమనిస్తూ ఉండటం చాలా ముఖ్యం. స్మార్ట్ ఫైనాన్షియల్ ఎకోసిస్టమ్ దిశగా అడుగులు ఇప్పుడే మొదలయ్యాయి.

# ఎయిర్‌టెల్ యూజర్లకు షాక్!

వివాదాల నడుమ ఆ ప్లాన్స్ బంద్.. కొత్తగా తెచ్చిన 'ఫాస్ట్ లేన్' ఏంటి? దేశీయ టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ తన పోస్ట్‌పెయిడ్ వినియోగదారుల కోసం ఒక కీలకమైన మార్పు చేసింది. గత కొన్ని రోజులుగా దేశంలో తీవ్ర చర్చకు దారితీసిన 'ప్రియారిటీ పోస్ట్‌పెయిడ్' సర్వీస్‌ను కంపెనీ అధికారికంగా నిలిపివేసింది. అయితే ఈ ప్లాన్‌ను పూర్తిగా రద్దు చేయకుండా, దీని స్థానంలో 'ఫాస్ట్ లేన్' అనే కొత్త




పేరుతో సర్వీసును రీబ్రాండ్ చేసింది. నెట్ న్యూట్రాలిటీ నిబంధనల ఉల్లంఘన జరుగుతోందనే ఆరోపణలు, ప్రభుత్వ రెగ్యులేటరీ సంస్థల నిఘా పెరగడంతో ఎయిర్‌టెల్ సైలెంట్‌గా తన వెబ్‌సైట్ నుండి 'ప్రియారిటీ' అనే పదాన్ని తొలగించి, దాని స్థానంలో 'ఫాస్ట్ లేన్ టెక్నాలజీ'ని చేర్చింది. టెలికాం మార్కెట్లో ఈ మార్పు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అసలేంటి ఈ వివాదంప్రీపెయిడ్ యూజర్లకు నష్టమా ఎయిర్‌టెల్ గత మే 19న ఈ ప్రియారిటీ ఎయిర్ టెల్ పోస్ట్ పెయిడ్ ప్లాన్స్‌ను లాంచ్ చేసింది. ఎక్కువ డబ్బులు చెల్లించే పోస్ట్‌పెయిడ్ కస్టమర్లకు, నెట్‌వర్క్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కూడా ఎలాంటి అభ్యంతరం లేకుండా హై-స్పీడ్ ఇంటర్నెట్ ఇస్తామని కంపెనీ ప్రామిస్ చేసింది. దీనికోసం '5+ నెట్‌వర్క్ స్లైసింగ్' అనే టెక్నాలజీని వాడుకుంటోంది. అంటే టోటల్ నెట్‌వర్క్‌లో ఒక ప్రత్యేక భాగాన్ని కేవలం పోస్ట్‌పెయిడ్ యూజర్ల కోసమే కేటాయిస్తారన్నమాట. అయితే, దీనిపై పార్లమెంటరీ కమిటీతో పాటు నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎక్కువ డబ్బులు ఇచ్చే వారికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తే.. దేశంలో కోట్లాది మంది ఉన్న తక్కువ బడ్జెట్ ప్రీపెయిడ్ కస్టమర్ల ఇంటర్నెట్ స్పీడ్ పడిపోతుందని, ఇది 'నెట్ న్యూట్రాలిటీ' నియమాలకు విరుద్ధమని స్పష్టం చేశారు. ఇంటర్నెట్ అనేది అందరికీ సమానంగా అందాలనేదే నెట్ న్యూట్రాలిటీ ముఖ్య ఉద్దేశం. ఎయిర్‌టెల్ వివరణ ఏంటి? ఈ వివాదంపై ఎయిర్‌టెల్ ప్రతినిధి స్పందిస్తూ.. తాము ప్లాన్స్‌ను వెనక్కి తీసుకోలేదని, కేవలం పేరు మాత్రమే మార్చామని క్లారిటీ ఇచ్చారు. 5+ స్లైసింగ్ టెక్నాలజీ వల్ల కేవలం పోస్ట్‌పెయిడ్ యూజర్లకే కాకుండా నెట్‌వర్క్ సామర్థ్యం పెరిగి ప్రీపెయిడ్ యూజర్లకు కూడా మంచి ఎక్స్‌పీరియన్స్ లభిస్తుందని వాదించారు. ఈ డేటాను టెలికాం రెగ్యులేటర్ 'ట్రాయ్' కి కూడా సమర్పించినట్లు తెలిపారు. మరోవైపు, కాంపిటీటర్ కంపెనీ 'వోడాఫోన్ ఐడియా' (ఎఐ) సోషల్ మీడియాలో ఎయిర్‌టెల్‌ను టార్గెట్ చేస్తూ.. "మా నెట్‌వర్క్‌లో అందరికీ సమాన ప్రాధాన్యత ఉంటుంది, అందరూ మాకు సమానమే" అంటూ యాడ్స్ ఇచ్చింది. ఈ పోటీని తట్టుకోవడానికి , ప్రభుత్వ నోటీసుల నుండి తప్పించుకోవడానికి ఎయిర్‌టెల్ తన టర్మ్స్ అండ్ కండిషన్స్ మార్చాల్సి వచ్చింది. ఇదివరకు వెబ్‌సైట్‌లో ఉన్న "రద్దీ సమయాల్లో పోస్ట్‌పెయిడ్ వాళ్లకు ఫస్ట్ ప్రెఫరెన్స్" అనే లైన్లను ఇప్పుడు పూర్తిగా తొలగించారు. ఎయిర్‌టెల్ పేరు మార్చినప్పటికీ, బ్యాక్‌గ్రౌండ్‌లో ఎయిర్ టెల్ వినియోగదారులకు 5+ స్లైసింగ్ ద్వారా వేగవంతమైన ఇంటర్నెట్ అందుతూనే ఉంటుంది. అయితే, పార్లమెంటరీ ప్యానెల్ రాబోయే రోజుల్లో దీనిపై ఎలాంటి తుది నిర్ణయం తీసుకుంటుందో, ప్రీపెయిడ్ యూజర్ల హక్కులను ఎలా కాపాడుతుందో వేచి చూడాలి.

## గతంలో జరిగిన తప్పులు.. ఎంతో బాధ అనుభవించా: శ్రీజ కొణిదెల



మెగాస్టార్ చిరంజీవి చిన్నకూతురు శ్రీజ కొణిదెల తన కష్టాలపై తొలిసారి పెదవి విప్పింది. చాలాకాలంపాటు తను అనుభవించిన బాధను బయటకు చెప్పుకుంది. ఎట్టకేలకు ఆ బాధ నుంచి బయటకు వచ్చేశానంటూ సోషల్ మీడియాలో ఓ వీడియో షేర్ చేసింది. "నాకే ఎందుకిలా జరుగుతోంది? ఎందుకింత బాధ అనుభవిస్తున్నాను? ఒకదాని వెంట మరొకటి వరుసగా కష్టాలు చుట్టుముడుతున్నాయేంటి? నేనేం పాపం చేశానని ఇంత క్షోభ అనుభవిస్తున్నాను? అని చాలారోజులు నాలో నేనే మథనపడ్డాను. నేను బాధితురాలిని అని బాధపడుతూ కూర్చున్న నేను నెమ్మదిగా ఆ భావన నుంచి బయటకు వచ్చాను. మన జీవితమేంటి.. ఇలా ఉంది! అని బాధపడటానికి బదులుగా దాన్ని మార్చుకునేందుకు ఏం చేయగలం? అని తెలుసుకోవడమే అసలైన మార్పు అని తెలుసుకున్నాను. 'సెల్ఫ్ మాస్టరీ ప్రాజెక్ట్' వల్ల నాలో ఆ మార్పు మొదలైంది. నా ఆలోచనల్లో క్లారిటీ వచ్చింది. జీవితం ప్రశాంతంగా మారింది. నేనేంటో తెలుసుకున్నాను. ఒకప్పుడు నా లైఫ్‌లో జరిగిన తప్పులే నా గుర్తింపును నిర్ధారించాయనుకున్నాను. కానీ, అది తప్పని తెలుసుకున్నాను. బాధ నాలో ఒక భాగమే కానీ, అదే జీవితం కాదని తెలిసొచ్చింది. మనిషిలో ఇంకా ఎన్నో లేయర్స్ ఉంటాయి. వాటిని ఒక్కొక్కటిగా తెలుసుకుంటూ ఉంటుంటే చాలా బాగుంది" అని చెప్పుకొచ్చింది. ఒకప్పుడు గుండె లోతుల్లో బాధను అనుభవించిన తాను ఇప్పుడు మానసికంగా ఆరోగ్యంగా ఉన్నానంది. ఈ పోస్ట్‌కు నిహారిక కొణిదెల స్పందిస్తూ.. "మై సూపర్ ఉమెన్" అని కామెంట్ పెట్టింది. శ్రీజ కొణిదెల 2007వ సంవత్సరంలో శిరీష్ భరద్వాజ్‌ను పెళ్లి చేసుకుంది. ఏడాది తిరిగేలోపు వీరికి కూతురు నివృతి జన్మించింది. కానీ కొంతకాలానికే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. 2011లో భర్తపై వరకట్న వేధింపుల కేసు పెట్టి పుట్టింటికి తిరిగొచ్చేసింది. 2014లో వీరికి విడాకులు మంజూరయ్యాయి. 2016లో నటుడు కల్యాణ్ దేవ్‌ను రెండో పెళ్లి చేసుకుంది శ్రీజ. వీరికి 2018లో కూతురు నవిష్క జన్మించింది. కానీ ఈ దాంపత్య జీవితం కూడా ఎంతోకాలం సాగలేదు. 2022లో వీరు విడిపోయారు.

## బాక్సాఫీస్ వద్ద రామ్ చరణ్ జోరు .. వర్కింగ్ డేలోనూ బుక్ మై షోలో రికార్డ్ టిక్కెట్ సేల్స్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన స్పోర్ట్స్ డ్రామా పెద్ది బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం తొలి వారంలోనే భారీ వసూళ్లతో ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది.గ్రామీణ క్రీడల నేపథ్యంలో రూపొందిన ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ ఎంటర్‌టైనర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. కొన్ని వర్గాల నుంచి మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, ఆ ప్రభావం కలెక్షన్లపై మాత్రం కనిపించడం లేదు. సినిమా విడుదలైనప్పటి నుంచి అన్ని ప్రాంతాల్లోనూ మంచి ఆక్యుపెన్సీ నమోదు చేస్తూ ముందుకు సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'పెద్ది' ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ.315 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన తెలుగు చిత్రాల్లో ఒకటిగా నిలిచే దిశగా సినిమా అడుగులు వేస్తోంది. ఇక సినిమా క్రేజ్‌కు నిదర్శనంగా బుక్‌మైషోలో నమోదవుతున్న టికెట్ సేల్స్ నిలుస్తున్నాయి. గత 24 గంటల్లోనే 1.27 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. సాధారణంగా వర్కింగ్ డే అయిన బుధవారం రోజున కూడా ఈ స్థాయి బుకింగ్స్ నమోదు కావడం విశేషంగా మారింది. ఇది ప్రేక్షకుల్లో సినిమాపై ఉన్న ఆసక్తిని స్పష్టంగా తెలియజేస్తోంది. పాజిటివ్ మౌత్ పబ్లిసిటీ కూడా సినిమాకు ప్రధాన బలంగా మారింది. ఇప్పటికే సినిమా చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను పంచుకుంటుండటంతో మరింత మంది థియేటర్లకు వస్తున్నారు. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు, యువత నుంచి మంచి స్పందన లభిస్తోందని ఎగ్జిబిటర్లు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని అనేక ఏరియాల్లో సినిమా త్వరలోనే బ్రేక్ ఈవెన్ మార్క్‌ను చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా ఈ వారం పెద్ద సినిమాల విడుదలలు లేకపోవడం కూడా 'పెద్ది'కి అదనపు ప్రయోజనంగా మారింది. దీంతో రెండో వారంలోనూ బలమైన వసూళ్లు నమోదు చేసే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.ఇక ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించగా, శివరాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. వృద్ధి సినిమాస్ నిర్మించిన ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందించారు.






## యాక్షన్‌తో అదరగొట్టిన అలియా భట్.. 'ఆల్ఫా' టీజర్ రిలీజ్

యశ్‌రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్ నుంచి వస్తున్న 7వ సినిమా 'ఆల్ఫా' టీజర్ బుధవారం విడుదలైంది. శివ్ రావల్ దర్శకత్వంలో భారీ యాక్షన్ చిత్రంగా వస్తున్న ఈ సినిమాలో అలియా భట్ మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో కనిపించింది. ఈ టీజర్‌లో అలియా భట్ ఒక ట్రైన్డ్ కిల్లర్‌గా శత్రువులపై విరుచుకుపడుతూ కనిపించగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఆమెకు తండ్రిగా ఒక ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాలో అలియా భట్ కేవలం ఒక సాధారణ అమ్మాయిలా కాకుండా, చిన్నప్పటి నుంచే పోరాటాల మధ్య పెరిగిన ఒక ప్రమాదకరమైన హంతకురాలిగా కనిపించబోతుంది. భారీ యాక్షన్ సీన్లు, గన్‌ఫైట్లు, ఫైటింగ్‌లతో ఆమె అదరగొట్టింది. ఈ టీజర్ సినిమాలోని యాక్షన్‌ను చూపించడమే కాకుండా, అలియా భట్, బాబీ డియోల్ పాత్రల మధ్య ఉండే బలమైన బంధాన్ని కూడా చూపిస్తోంది. మరోవైపు ఈ సినిమాలో మరో హీరోయిన్ శర్వరి కూడా నటిస్తోంది. రాబోయే రోజుల్లో ఆమె పాత్రకు సంబంధించిన వివరాలను చిత్ర బృందం ప్రకటించనుంది. బాలీవుడ్‌లో ఇద్దరు హీరోయిన్లు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న అరుదైన భారీ యాక్షన్ సినిమా ఇది. యాక్షన్, సెంటిమెంట్, సస్పెన్స్, కామెడీ కలబోతగా వస్తున్న ఈ సినిమాలో అనిల్ కపూర్ కూడా ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. ఈ మోస్ట్ అవేటెడ్ స్పై థ్రిల్లర్ మూవీ 2026, జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## 'తుంబాడ్' దర్శకుడి నెక్స్ట్ లెవెల్ ప్లాన్: ఒకేసారి రెండు భారీ చిత్రాల ప్రకటన.. రిలీజ్ ఇయర్స్‌తో సహా!




'తుంబాడ్' చిత్రంతో దేశవ్యాప్తంగా సినీ ప్రియులను తనవైపు తిప్పుకున్న దర్శకుడు రాహి అనిల్ బర్వే తన తదుపరి ప్రాజెక్ట్‌లకు సంబంధించిన కీలక అప్‌డేట్ ఇచ్చారు. విలక్షణమైన కథాంశాలు, విజువల్ వండర్స్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసే ఈ దర్శకుడు.. తాజాగా రెండు కొత్త సినిమాలను అధికారికంగా ప్రకటిస్తూ వాటి టైటిల్స్ మరియు విడుదల కానున్న సంవత్సరాలను వెల్లడించారు. గతంలో 'తుంబాడ్' (2018) సినిమా ద్వారా "తండ్రి, కొడుకుల దురాశ" అనే కాన్సెప్ట్‌తో పితృస్వామ్య వ్యవస్థ చక్రం ఎలా తిరుగుతుందో అద్భుతంగా చూపించిన రాహి అనిల్ బర్వే, ఇప్పుడు అంతకంటే విభిన్నమైన కథాంశాలతో ముందుకు వస్తున్నారు. ఆయన ప్రకటించిన రెండు కొత్త ప్రాజెక్ట్‌లను ఒకసారి చూసుకుంటే. దేవుళ్లు, పురుషులతో పాటు మొట్టమొదటి ధైర్యవంతురాలైన మహిళ అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో ఈ చిత్రాన్ని ప్రకటించారు. విముక్తి యొక్క ఆరంభం, స్త్రీవాదం (ఫెమినిజం) పుట్టుక నేపథ్యంతో సాగే ఈ విలక్షణ చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు రానుంది. పురుషుడు, స్త్రీ మరియు సృష్టి యొక్క చివరి సాక్షి అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా తెరకెక్కనుంది. పురాణాల్లోని ప్రసిద్ధ 'కాకభుషుండి' పక్షికి సంబంధించిన ఒక చీకటి గాథ ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ 2030లో విడుదల కానుంది. భారతీయ చలనచిత్ర రంగంలో సరికొత్త ప్రయోగాలకు వేదికగా నిలిచే రాహి అనిల్ బర్వే నుంచి వస్తున్న ఈ రెండు ప్రకటనలు చూస్తుంటే, ఆయన ప్రేక్షకులకు మరోసారి వెండితెరపై ఒక అద్భుతమైన కాన్సెప్ట్ ఆధారిత ప్రపంచాన్ని చూపించబోతున్నట్లు స్పష్టమవుతోంది. దాంతో ఈ ప్రాజెక్ట్‌లపై ఇండస్ట్రీలోనూ, ప్రేక్షకుల్లోనూ అప్పుడే భారీ అంచనాలు మొదలయ్యాయి. ఇవే కాకుండా రాహి అనిల్ బర్వే 'ఫ్యామిలీ మ్యాన్' దర్శకులతో కలిసి రక్తబ్రహ్మాండ్ అనే వెబ్ సిరీస్ తెరకెక్కిస్తున్నాడు. ఇందులో సమంత కథానాయికగా నటిస్తుండగా.. ఆదిత్య రాయ్ కపూర్, అలి ఫజల్, వామిఖా గబ్బీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## టాక్సిక్ రిలీజ్‌పై షాకింగ్ బజ్.. అక్టోబర్‌కు వాయిదా పడిన యష్ పాన్ ఇండియా మూవీ?



కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' గురించి మరోసారి ఆసక్తికర వార్తలు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించుకున్న యష్ నుంచి వస్తున్న తదుపరి సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే సినిమా విడుదల తేదీ విషయంలో మాత్రం ఇంకా స్పష్టత రాకపోవడంతో అభిమానుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో యష్ సరసన రుక్మిణి వసంత్, తారా సుతారియా నటిస్తుండగా, కీలక పాత్రల్లో హుమా ఖురేషి, కియారా అద్వానీ, నయనతార కనిపించనున్నారని సమాచారం. భారీ తారాగణం, హై బడ్జెట్ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమా మొదటి నుంచే దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ చిత్రం ఇప్పటికే విడుదల కావాల్సి ఉన్నప్పటికీ, మేకర్స్ సరైన సమయాన్ని ఎంపిక చేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. మార్కెట్ పరిస్థితులు, ఇతర పెద్ద సినిమాల విడుదలలు, పాన్ ఇండియా స్థాయిలో బిజినెస్ అవకాశాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని విడుదలను వాయిదా వేస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా వినిపిస్తున్న బలమైన బజ్ ప్రకారం 'టాక్సిక్' సినిమా ఈ ఏడాది అక్టోబర్ నెలకు షిఫ్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయట. ముఖ్యంగా అక్టోబర్ తొలి వారం లేదా మూడో వారంలో విడుదల చేయాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు కన్నడ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అభిమానులు అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు చిత్ర బృందం నుంచి రిలీజ్ డేట్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందనేది తెలియాల్సి ఉంది. అయితే పండుగల సీజన్‌ను టార్గెట్ చేస్తూ అక్టోబర్‌లో విడుదల చేస్తే సినిమాకు మరింత భారీ ఓపెనింగ్స్ వచ్చే అవకాశముందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇక ఈ భారీ చిత్రానికి సంగీత సంచలనం రవి బస్రూర్ స్వరాలు అందిస్తున్నారు. కేజీఎఫ్ సినిమాలతో తన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో ప్రేక్షకులను ఉర్రూతలూగించిన ఆయన, టాక్సిక్‌కు కూడా ప్రత్యేకమైన సంగీతాన్ని అందిస్తున్నట్లు తెలుస్తోంది. యష్‌తో పాటు కేవీఎన్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా యాక్షన్, ఎమోషన్, స్టైలిష్ విజువల్స్ కలగలిసిన విభిన్న అనుభూతిని అందించనుందని సమాచారం.

PUBLISHED AND OWNER BY AVANAGANTI ANIL KUMAR Published at 3-83/A, BADANGPET, BALAPUR, RANGAREDDY District TELANGANA - 500058. Printed at SMILYSONLINE 6-7-48, VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District, TELANGANA - 500070. EDITOR AVANAGANTI ANIL KUMAR PRGI NO. : TGTEL/26/A2290 , CELL : 9133444314